POSTAL REGD.NO.PRAKASAM/16/2024-2026
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
జూన్ 2025
వెల – ₹ 10.00

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక
సంపుటి: 43 సంచిక: 02



పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ తల్లి ఆరాధన
జూన్ 03, 2025

# ఈ నెల పండుగలు

జూన్  02  - శ్రీ చివటం అమ్మ ఆరాధన (జేష్ఠ శుద్ధ సప్తమి)

జూన్  03 - పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ తల్లి ఆరాధన

జూన్   11 - శ్రీ పాకలపాటి గురువుగారి జయంతి (జ్యేష్ట పౌర్ణిమ)




పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి నాలుగవ ఆరాధనోత్సవము  జూన్ 3, 2025 న గుమ్మళంపాడు 'శ్రీ అలివేలు మంగమ్మ దివ్యసన్నిధానము' లో జరుగును. ఉత్సవానికి సంబంధించిన మరిన్ని వివరముల కొరకు శ్రీ మధు గారిని (9542985469), శ్రీ పి.రమేష్ గారిని (9440018038) సంప్రదించగలరు.

# మానవులు శ్రమించి జీవించాలన్నారు సాయి

*పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ*

ఆధ్యాత్మికపరమైన జీవితమంతా భగవంతునిపట్ల కృతజ్ఞతతో జీవించడమే! ఈ జీవిత విధానమేమో, దానిని అమలులో పెట్టే ముందు అవి సార్థకం కావాలంటే మానవులు తెలుసుకోవలసినదేమో – అదే సత్యం; దానిని చక్కగా అర్థం చేసుకుని సరియైన భావంతో ఆచరణలో పెట్టడమే ధర్మము, ధర్మాచరణ. ఈ రెంటినీ హృదయపూర్వకంగా మానవులు అలవాటు చేసుకోవడం అంత తేలిక గాదు. అందుకు భగవంతునిపట్ల అచంచలమైన విశ్వాసము, ఆచరణలో ఎదురయ్యే సాధక బాధకాలను ఓర్చుకొనడం, ప్రేమ పారవశ్యము కొంతైనా వుండాలి. ఈ రెండు భగవదనుగ్రహాన్ని కొంతైనా చవిచూడనిదే కలగవు, అలా కాకపోతే మానవుడు పశువుగానే వుండిపోతాడు.

ఇంద్రియాలకూ, మనస్సుకు విషయసుఖాలపట్ల గల సహజమైన చాపల్యము యింతా అంతా అని చెప్పరానిది. పసిబిడ్డలుగా వున్నప్పుడు కించిత్తైనా నాలుకకురాస్తే భరించలేనంతగా బాధించే కారంగూడా తినగా, తినగా అదిలేకుంటే ముద్ద ఎత్తలేని పరిస్థితికి తేగలదు. ఇలా ఎన్ని రుచులకో అలవాటుపడిన మనస్సు, సుఖాలకు అలవాటుపడిన శరీరము ఈ అంతర్ యుద్ధంలో మనలోని మలిన సంస్కారాల పక్షమే వహిస్తుంటాయి. ఇది తెలిసిన ఋషులు పిల్లలను చిన్నవయస్సునుండే ఆరితేరిన ఆచార్యునివద్దనుంచి ఒక వంక వారి మనస్సులను సదవగాహనతోనూ, శరీరాలకు క్రమశిక్షణను అలవరిచేలా చూచుకోవాలని ఆదేశించారు. ఇదే బ్రహ్మచర్యాశ్రమము.

అది అలవడ్డాకనే, అలవరచుకొనినవారికి మాత్రమే, గృహస్థ జీవితం అలవర్చుకోడానికి, అతనిని అన్ని రీతులా పరీక్షించిన ఆచార్యమండలి అనుమతి, ఆశీస్సులు యివ్వవలసి వుండేది. ఇదే ఈనాడు వివాహమహోత్సవములో 'సదస్యం' అని చెప్పబడుతుంది. ఆచార్యులను సేవించి భగవదనుగ్రహాన్ని చవిచూచి, పరవశించి తన జీవితమంతటినీ సంపూర్ణంగా దానిని పొందడానికి మాత్రమే అంకితము చేయదల్చి అందుకవసరమైన వేదాంతోపదేశంకోసం సర్వమూ విడచి బయలుదేరిన వారికి మాత్రమే గృహస్థాశ్రమానికి అర్హత లభించేది. కారణం అట్టివారు మాత్రమే రాగ, ద్వేష, మమకారాదులలో తగులుకొనకుండా సర్వ జీవుల శ్రేయస్సు కోసమై తన శక్తి సామర్థ్యాలను అంకితం చేసి, అట్టి పవిత్ర జీవికతో తనను పోషించుకుంటూ, తిరిగి అటువంటి ఉన్నత సంస్కారాన్ని పొందిన బిడ్డలను సమాజానికి అందించడమే గృహస్థాశ్రమము యొక్క లక్ష్యము. అప్పుడుమాత్రమే అనేక జన్మలుగా మనలో పాతుకొన్న కామాదివికారాలు అత్యంత సహజములన్న

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:43 జూన్ - 2025 సంచిక:02

*పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన "సాయిబాబా"*

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | మానవులు శ్రమించి జీవించాలన్నారు సాయి | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | పరిప్రశ్న | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 06 |
| 03. | కృతజ్ఞత ఎందుకు తెలుపుకోవాలి? | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 08 |
| 04. | మాతృదేవి స్మృతులు | శ్రీమతి చిన్మయి | 11 |
| 05. | అమ్మమాట - బంగారు బాట | శ్రీమతి శ్రీదేవి | 13 |
| 06. | వార్తాలాపము | శ్రీమతి అడిదం వేదవతి | 16 |
| 07. | బుద్ధ ధ్యాన హృదయము | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 20 |
| 08. | భగవాన్ శ్రీ భరద్వాజ | శ్రీమతి శ్రీదేవి | 22 |
| 09. | శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు | శ్రీమతి శ్రీదేవి | 23 |
| 10. | ద్వారకామాయి అనుభవమండపము | శ్రీమతి అనుపిండి నాగ శ్రావణి | 25 |
| 11. | ఆచార్యుని అద్భుత లీలలు | శ్రీ పర్వతరావు | 27 |


**చిరునామా**

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550
**www.saibharadwaja.org**

చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

**చందా వివరములు**

విడి ప్రతి : ₹ 10-00
సంవత్సర చందా : ₹100-00

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

నిర్లిప్తభావమేర్పడి, వాటివట్ల మానవులకున్న భ్రమ తొలగగలదు. గృహస్థ జీవితమంతా సమాజం పట్ల, తన పూర్వీకుల పట్ల, యింతటి ఉత్తమ ధర్మాలు మనకు ప్రసాదించిన ఋషుల పట్ల, మనకున్న గౌరవం వ్యక్తమవ్వాలి. అప్పుడే వారి అనుగ్రహాన్ని సంపూర్ణంగా పొందగలగాలన్న ప్రయత్నం ఆరంభమవుతుంది.

కానీ అంతమాత్రమే చాలదు. ఇలా జీవునికి ప్రబోధమయ్యాక, అనాదిగా అతని హృదయంలో నాటుకుపోయిన మలిన సంస్కారాలకు – పైన చెప్పిన భగవదనుగ్రహం పొందాలన్న ఆకాంక్షకూ, సంఘర్షణ ప్రారంభమవుతుంది. అప్పటినుండి అడుగడుగునా ప్రతి జీవిత సంఘటనలోనూ సద్గురువు తెల్పిన ధర్మానికి – మానవులలోని దృఢములు, మలినములు అయిన సంస్కారాలకూ, అంతర్యుద్ధం ప్రారంభమవుతుంది. సాధకుడు అనుక్షణము జాగరూకుడై ప్రతి సన్నివేశంలోనూ సాయి చెప్పిన ధర్మం వైపుకు అడుగువేస్తూ, యిట్టి కుసంస్కారాలను వెలివేస్తూ పోవల్సివుంటుంది.

కాని ఈ పరిస్థితి ఏర్పడకముందు నుండే జీవితంలో మనకు మన మలిన సంస్కారాలను అనుసరించి జీవించడం అలవాటయిపోయి వుంటుంది. అదే అభ్యాసంగా ఘనీభవించి వుంటుంది. అభ్యాసబలం అందువలన మనలో తలయెత్తే స్వార్థము, మమకారము, వాటి ప్రతిబింబాలైన అసూయా, ద్వేషము, అహంకారము మొదలైనవి మన హృదయాలలో మహావృక్షాలుగా నాటుకొనిపోయి; వాటి శాఖలు అనంతమైన ఆకాశం వంటి పరమాత్మనుగూడ మనదృష్టినుండి మరుగుపరుస్తాయి. అట్టి జీవికి భగవంతుని అనుగ్రహము ఒక్కసారైనా చవిచూస్తేగాని యిట్టి అవరోధాలను అతిక్రమించి ఉత్తమ జీవితానికై ప్రయత్నించే సంకల్పమైనా కల్గదు. ఆ భగవదనుగ్రహము నిప్పురవ్వలాగా మన హృదయంలో రాచుకొని ఆ మహావృక్షాలను భస్మంచేసి ఆకాశంవంటి పరమాత్మతత్వంపై మనదృష్టి ప్రసరించేలా చేస్తుంది. అటువంటి భగవదనుగ్రహమే సాయి వంటి పూర్ణుడయిన సద్గురువు లభించటమంటే!

వారి రూపంలో భగవంతుని అనుగ్రహము, సర్వశక్తిమత్వము జీవులు చవిచూస్తాయి. అటు తర్వాత ఎంత శ్రమించియైనా ఆయన ఋణం తీర్చుకొని అటు తర్వాత మన పట్ల, భగవంతుని పట్ల తీర్చుకోవలసిన ఋణాలను తీర్చుకొనగలడానికి అట్టి మానవుడు ఎదురు చూస్తాడు. అదే ఆత్మవిద్య లేక బ్రహ్మవిద్య.

మనస్సుకు, ఇంద్రియాలకు మరియు శరీరానికి సంపూర్ణంగా అందుకు అంకితమయ్యేలా శిక్షణమివ్వడమే వానప్రస్థాశ్రమము. అట్టి శిక్షణ సంపూర్ణంగా అలవడిన స్థితియే సన్యాసాశ్రమం. అట్టి స్థితి అతనికి కలిగినదో లేదో పరీక్షించిన తర్వాత మాత్రమే వెనుకటి రోజులలో అతనికి అట్టి సన్యాసదీక్షని యిచ్చేవారు. సామాన్యులందరికీ యిలా ఒక ఆశ్రమం తర్వాత ఇంకొక ఆశ్రమాన్ని సార్థకం చేసుకుంటూ మాత్రమే పురోగమించడం భద్రము, నిర్దుష్టము అని ఋషులు నొక్కి చెప్పారు.

ఈ ఆశ్రమాలలో దేనికితగిన శిక్షణ, బోధ దానికి ప్రత్యేకంగా వుండేది. ఆదిశంకరులవంటి, సాయిబాబావంటి అవతారమూర్తులకు మాత్రమే యిది వర్తించదని మహాత్ములందరూ చెప్పారు. అట్టివారు తమ భక్తులకు మరియు శిష్యులకు బోధించినదిగూడ ఈ ప్రకారమే వుండేది. సామాన్యులైన బోధకులలాగ ఉన్నతస్థాయికి చెందిన వేదాంతము వారెన్నడూ విక్రయించరు; గురువుల మనిపించుకోవడానికి పాటుపడరు.

ప్రత్యక్షంగా సాయిని దర్శించిన 'నారాయణ్ ఆశ్రం' అను సన్యాసి, "బాబా మహావాక్యాలు గాని లేక శంకరాచార్యుడు వ్రాసిన ఆత్మబోధ లేక 'వివేక చూడామణి' వంటి గ్రంథాలలో చెప్పినరీతిన (వేదాంతం) గాని ఉపదేశించడం నేనెన్నడూ వినలేదు" అని వ్రాశాడు. ప్రొఫెసర్ నార్కేగూడ యిలా వ్రాశాడు: "మోక్షము మరియు వివేక వైరాగ్యాలు మొ॥న విషయాల గురించి బాబా చెప్పడమెన్నడూ నేను వినలేదు. ఆసనాలు,

*మిగతా 19వ పేజీలో*

# పరిప్రశ్న

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

**ప్రశ్న :- ?**

**- అ. ఉమా మహేశ్వరరావు**

**జవాబు :-** ఈ రోజే నీకు వచ్చిన ఘోరవిపత్తు గురించివిని నిజంగా ఎంతగానో బాధకల్గింది. ఇంతటి విపత్తు నీకు రాకుండా సాయి కాపాడివుంటే ఎంతబాగుండేదోనన్పించింది. ఎలా నీకు ధైర్యము, నిబ్బరము చెప్పాలో తెలియడం లేదు. కారణం ఎవరం చెప్పినా యిది పరోక్షంగా చెప్పే మాటలు, నీ పరిస్థితి ప్రత్యక్షానుభవమూ, రెండూ ఒకటెలా అవుతాయి?

అయితే మరొక విషయం కూడా వ్రాయాలి. అలా వ్రాస్తే లోకం నన్ను సభ్యత తెలియని కటిక వాడంటుందేమో తెలియదు. కారణం హృదయంలేనివి, సత్యహరములూ అయిన సభ్యతలతో నా ప్రాణం విసిగిపోయింది. కనుక వ్రాయకుండా వుండలేను.

జాబు చూడగానే మొదట నా జీవితము గుర్తొచ్చింది. మా అమ్మను నేను 2వ యేట పొగొట్టుకొని మాతృప్రేమ అంటే ఏమో తెలియకుండా పెరిగాను. అమ్మ ఎత్తుకొనడమేమిటో, నీరుపోసి, గుడ్డలేసి లాలించడం ఏమిటో ఎన్నడూ ఎరుగను. అలాంటి ఆపత్సమయంలో మమ్మల్ని పలుకరిస్తే మా బాధ్యత ఎక్కడ మోయవలసివస్తుందోనని ఒక్క బంధువు కూడా మమ్ములను దగ్గరకు తీయలేదు. నాన్నగార్కి 45 సం॥లు వుంటాయి. మేము నల్గురన్నదమ్ములము; చివరివాణ్ణి నేను. నా తర్వాత 3 మాసాల ఒక చెల్లెలు. ఇక నాన్నగారే విశ్వరూపం దాల్చారు. ఆయనే అమ్మ, నాన్న, వైద్యుడు, గురువు అయి మమ్మల్ని పెంచారు. ఆయన అనేవారు “మిమ్మల్ని మీ అమ్మ నాచేతులలో వుంచి, ఎవరికీ పెంపకమివ్వవద్దని చెప్పి మరీ కన్నుమూసింది” అని. తర్వాత బంధువులెవరూ సహకరించకపోవడంతో “ఏమైనా సరే సమర్థవంతంగా మన కర్తవ్యం నిర్వహించాలిగాని కృంగి ప్రయోజనంలేదు” అని నిర్ణయించుకొని ధైర్యోత్సాహాలకోసం ‘భగవద్గీత’ చదివేవారట రోజూ. పాండవులెన్ని కష్టాలుపడినా చలించక కృష్ణుని, స్వధర్మాన్ని అంటిపెట్టుకొనడం వలన అర్జునుడికి గీతోపదేశము, విశ్వరూప సాక్షాత్కారమూ ఆ భగవంతుని నుండి పొందే అర్హత ఎలా కల్గిందో గుర్తు తెచ్చుకునేవారట. అనతికాలంలో గుర్తించారట – అసలైన జీవితం నాటి నుండి ఆరంభమైందని. అంతకుముందు గాని ఆ విషాదఘట్టం జరగకుంటే అందరివలెనే జీవితంలో సుఖదుఃఖాల లోతు యింతవుంటుందని గాని, మొలకెత్తనివ్వాలేగాని మన హృదయంలో యింతటి ప్రేమా వుండటం సాధ్యమనీ తెలిసేదేగాదుట. అదొక వరమనేవారు. అలా జాగృతమైన తమ హృదయంలోనే మాతృత్వంగా మా అమ్మ వారిలోంచి బిడ్డలను చూచుకొన్నది – అనేవారు. అలాంటి

అవకాశం తమకు రాకుంటే జీవితం అవాస్తవికంగానే, వుండిపోయేదనేవారు. అప్పటినుండి అంటుండేవారు. "కష్టంలేని బ్రతుకు బ్రతుకేగాదు. దుఃఖమెరుగని మనిషి మనిషే కాలేదు!" అని.

అలానే అన్నగారిబిడ్డ చనిపోవడం నా జీవితంలో నేను మేల్కొనడానికి ఉపకరించింది.

కనుక ఒక వంక తాత్కాలికంగా చూస్తే యిలాంటిది నాలా హృదయ విదారకమయిన ఘట్టమే అయినా, నిజానికి అదొకవరంగా పరిణమించగల మహావకాశం గూడా. నీలోని సంపూర్ణ మానవత్వము, ఆత్మ బలము మేల్కొని నీవుగూడ తలమోటించి పరిస్థితుల నెదుర్కొని నిలబడగల్గితే నీ హృదయం ఇలా తల్లిదండ్రులను కోల్పోయిన ఎందరు అభాగ్యులకో ఆ వెలలేని ప్రేమను పంచియివ్వగలదు.

విత్తనం నశిస్తే గాని మొక్క కాజాలదుగదా? అలానే ఏసును శిలువవేస్తే గాని క్రీస్తుగా రూపొందటమూ జరుగదు. కొలిమిలో వుంచితే గాని బంగారం మేలిమిగాదు.సూర్యోదయం సూర్యాస్తమయంలాగా అనివార్యంగా ప్రతివారికీ ఏదో ఒక సమయంలో ఏదో ఒక రీతిన ఎదురై తీరవలసిన మృత్యువును గూడ అమృతత్వాన్ని సాధించి సాటివారి కందించేలా మనకుపకరించగల అగ్ని పరీక్షలా యీ ఘటనను తీసుకో. కృంగవద్దు! 'బిడ్డ భవిష్యత్తేమిటి అనవద్దు' ప్రపంచంలో పసితనంలో తల్లులను పోగొట్టుకున్న నాలాంటి వారెందరులేరు? వారి వారి పూర్వపుణ్యాన్ని బట్టి వారి జీవితాలను వారే తెచ్చుకుంటారు. అన్నీ యథాప్రకారం జరుగుతాయి. ఆనాడు మేమంతా ఇలా మనగల్గుతామని మానాన్నగార్కిగాని, మా బంధుకోటికిగాని తోచివుంటుందా? బంధువుల సహకారం లేకపోతే ఏమైనా ఆగిందా? అంతటినీ సక్రమంగా నడిపించి పిపీలికాది బ్రహ్మపర్యంతమూ తన బిడ్డలుగా చూచుకొనే ఆ భగవంతుడు సర్వమూ చూచుకుంటాడు. 'అల్లామాలిక్' అన్న సాయిమాటల లోతెంతో ప్రత్యక్షంగా చవిచూపించనున్న ఈ దివ్యసందేశాన్ని సందేశంగా తీసుకో! మృతిచెందిన వారిగూర్చి ఎటూ ఎప్పుడూ ఆలోచించనక్కరలేదు. ఈ విషయం "సాయి చనిపోవడమంటే ఏముంది? భూమిలోకి పోవడమేగదా? అంతమాత్రానికే దుఃఖిస్తూ కూర్చోవాలా? అని, తప్పక జీవుడు మరలా జన్మించి తీరుతాడనీ చెప్పారు. కృష్ణుడు గీతలోను అదే చెప్పాడు. "ప్రాణాలు పోవటం, పోకపోవటం గురించి పండితుడు (యోచించగలవాడు) శోకించడు" అని చెప్పి, "నీవు శోకింపతగనిదాని గురించి శోకిస్తున్నావు" అని అర్జునుణ్ణి మందలిస్తాడు. అందరికీ అదంతా వేదాంతంగా వుంటుంది. భగవంతుడను, గురువను ఆయనను నిజంగా ప్రేమించినవాణ్ణి యీ సత్యం చక్కగా అనుభవంతో తెలుసుకొనేలా చేస్తాడు. మొదట ఆ అనుభవం అగ్నిపరీక్షలాగా వుండవచ్చు. కాని కొంచెం నిబ్బరంతో, నిష్ఠ, ఓరిమిలతో నిలబడి ఆయనకు శిరస్సువంచితే యిక ఏ దుఃఖమూ మనను స్పృశించలేని స్థితికి మనని సిద్ధం చేయటంతో అది మొదటిపాఠం – ఎంట్రన్స్ ఎగ్జామ్. అందులో ఫెయిల్ అయినవారంతా –ఏమి పొందకుండా పోయేవారే, వారి ఆధ్యాత్మికత పై రంగు మాత్రమే!

ఇందులో దుఃఖించేందుకేమీలేదు. మేమంతా వేరువేరు రూపాలలో ఆ ఎంట్రన్స్ టెస్టులో పాసయినవారమే. కొత్త Candidate వైన నీవు బాధపడుతుంటే మా గతము గుర్తుకొస్తుందిగాని దాని అంతరార్థం తెలుసు. దీనిని సార్థకం చేసుకొనడమో, నిరర్థకం చేసికొనడమో తేలిపోయే విషమఘట్టం గనుక మాకు చేతనైనంత నిన్ను హెచ్చరిస్తూన్నాము. నీకు ఆత్మస్థైర్యమిమ్మని సాయిని ప్రార్థిస్తున్నాము.

తొందరపడి, ఆవేశపడి, బెంబేలుపడి, "దేవుడు, సాయి–ఏమీ లేదు!" అన్న భ్రమకు రాకు. అలా అన్నందువల్ల గతించిన వారు తిరిగి వచ్చి పరిస్థితి అంతా యథాపూర్వమయ్యేటట్లయితే తప్పక అలానే అను. అలా అన్నందు వలన వారిగేదేమీ లేదు, సరికదా పైన వివరించినంత చక్కని హృదయ పరిపాకము, వికాసము, ప్రేమ మేల్కొనకుండా మూసేసే జీవన్మృతి ఆ వాదం. బాగా యోచించు.●

(జూన్ 2011 సాయిబాబా మాసపత్రిక నుండి)

# కృతజ్ఞత ఎందుకు తెలుపుకోవాలి?

పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ

'కృతజ్ఞత' ఎందుకు తెలుపుకోవాలి? అన్న విషయం గూర్చి, ప్రకృతి పట్ల, ఇతర జీవుల పట్ల, ఇతర మానవుల పట్ల 'కృతజ్ఞత' ఎందుకు కలిగివుండాలన్న విషయం గూర్చి ఇంతకుముందు క్లుప్తంగా చెప్పుకున్నాము. ఇప్పుడు మరికొంచెం చెప్పుకుందాము.

'కృతజ్ఞత' అనేది మానవ జీవితంలో అతిముఖ్యమైన అంశమన్నది నిజమే. కానీ భగవంతుడు మనకందించిన విశాల ప్రకృతి, ఇతర జీవులు, వాటన్నింటి రూపంలోనూ మనపై ఆయన కురిపించే కరుణ మనకు అవగతం కావాలంటే వాటన్నింటినీ గుర్తించే మేధాశక్తి, చక్కటి నిర్మాణమూ గల శరీరమొకటి వుండాలి. అట్టిది ప్రసాదించింది కూడా వారేగదా! అట్టి శరీరమే లేకపోతే మనమేమి చేయలేము.

పూజ్యశ్రీ మాస్టరుగారిలా అంటారు: "అసలు మన శరీరాన్ని గురించి ఆలోచిస్తే చాలు. అట్టి అద్భుతమైన శరీరాన్ని సృష్టించిన భగవంతుని పట్ల భక్తి కలుగక మానదు. దానిని ప్రసాదించిన ఆయనకు కృతజ్ఞత చెప్పకుండా వుండలేము".

ఆలోచిస్తే నిజంగా ఈ శరీరనిర్మాణమెంత చిత్రమైనది!! మెదడు, వెన్నుపూస, గుండె, శ్వాసకోశము, మూత్రపిండములు, జీర్ణకోశము, చిన్న, పెద్ద ప్రేగులు, మల మూత్రాశయములు, చేతులు, కాళ్ళు, నోరు, ముక్కు చెవులు, ఎముకలు, కండరములు, నరములు – ఇవన్నీ ఎంతో పొందికగా ఈ శరీరంలో అమర్చబడివున్నాయి!!

మనం ఆహారం తీసుకోవాలంటే దానిని నోటికి అందించడానికి చేతులు; తీసుకున్నదానిని నమలి లోపలకు పంపడానికి నోరు, నమలడానికి అవసరమైన దంతాలు, నాలుక, లోపలకు వెళ్ళిన తర్వాత పచనం చేయడానికి జీర్ణకోశము, దానిని అరిగించి శరీరభాగాలకు పంపే చిన్న ప్రేగులు, వ్యర్థ పదార్థాలను బయటకు పంపే పెద్ద ప్రేగులు, మలమూత్రనాళములు – ఇవన్నీ ఒక విభాగమైతే...

గాలి పీల్చడానికి ముక్కు, దాని ద్వారా వెళ్ళే వాయువును స్వీకరించి, ప్రాణ చలనానికి అవసరమైన వాయువును స్వీకరించి, అనవసరమైన వాయువును బయటకు పంపించే శ్వాసకోశములు – మరొక విభాగము.

శరీరంలోని రక్తాన్ని శుభ్రపరచే గుండె – దానిని శరీరమంతటికీ పంపిస్తూ అపరిశుభ్ర రక్తాన్ని మళ్ళీ గుండెకు చేర్చే రక్తనాళములు – ఇంకొక విభాగము.

గుండె, శ్వాసకోశములు – మనిషి మరణించేదాకా

క్షణం గూడ విరామం లేకుండా శ్రమించడం ఎంత అద్భుతమైన విషయము!

ఇవిగాక, దేనినైనా చూడగలగడానికి కళ్ళు, వినగలగడానికి చెవులు, ఏ పనినైనా చేయగలగడానికి కాళ్లు చేతులు – మరొక విభాగము.

ఇవన్నీ సక్రమంగా కదలడానికి అవసరమైన ఎముకలు, కండరములు, కీళ్ళు, కణసముదాయము – మరొక విభాగము.

ఇదీగాక అద్భుతమైన పునరుత్పత్తి వ్యవస్థ –

వీటిలో ఏ ఒక్కదానిలో చిన్న సమస్య వచ్చినా శరీర పరిస్థితి అస్తవ్యస్తమే!

అంతేగాక, శరీరంలో దేనినైనా మనము బయటకు తీయగలిగితే తిరిగి దానిని శరీరంలో అలా కూర్చలేము. ఇది యింకా అద్భుతమైన విషయం. ఉదాహరణకు అప్పుడే పుట్టిన బిడ్డను వెంటనే తల్లి గర్భంలో అలా పొందికగా వుంచాలంటే సాధ్యం కాదనిపిస్తుంది. అలాగే చిన్న ప్రేవులను బయటకు తీస్తే మళ్ళీ అలాగే పెట్టడం మన వల్లగాదు. అలాగే ఒకడు చాలా ఎక్కువ ఆహారం తీసుకునేవాడు వున్నాడనుకుందాము. వాడు రెండు కిలోల అన్నం తిన్నప్పటికీ అతని పొట్ట పెద్దది కాదు. మామూలుగానే వుంటుంది. మరి అంత అన్నం శరీరంలో ఎలా యిమిడింది? విచిత్రమేమంటే ఇవేవీ ఒకదానికొకటి అడ్డురాకుండా సర్దుకుపోతూ ఒదిగి ఒదిగి తమ పనులు సక్రమంగా చేసుకుపోతుంటాయి. కానీ ఈ శరీరం గల మానవునికి మాత్రమే ప్రకృతితోగానీ, తనవంటి శరీరాలేగల సాటి మానవులతో గానీ సర్దుకుపోవడం ఎంత కష్టమో!

ఇవన్నీ ఒక ఎత్తైతే, వీటన్నింటికీ సరియైన సమయంలో సంకేతాలు అందిస్తూ సక్రమంగా పనిచేయించే అతి ముఖ్యమైన పరికరం మెదడు. ఈ మెదడు సరిగ్గా పనిచేయకపోతే ఏమీలేనట్టే! దానిలో ఏమాత్రం తేడా వచ్చినా కొన్ని విషయాలు గ్రహించలేకపోవడము, చేయలేక పోవడము, పిచ్చివారుగా మారడము – ఇలాంటివన్నీ జరుగుతాయి. మెదడు పూర్తిగా దెబ్బతింటే మిగతా అవయవాలు పనిచేసే స్థితిలో వున్నా మనిషి ప్రాణమున్న శవమే. అయితే బాహ్యక్రియలకు అది ప్రాణమున్న శవమే అయినప్పటికీ ప్రాణం వున్నంతవరకూ 'నేను' అనే ప్రజ్ఞ వుంటుంది. ఆ ప్రాణంపోతే ఎటువంటి స్పందనలూ ఆ శరీరానికి వుండవు. ఇంతకూ ఈ 'నేను' అనే ప్రజ్ఞ ఏమిటి? అది ఎలా పనిచేస్తుంది? ప్రాణం పోయాక ఎక్కడికి పోతుంది? అసలు ప్రాణమంటే అదేనా? దీనినంతటినీ నడిపించే శక్తి ఏదైనా వున్నదా? వీటన్నింటినీ ఆలోచించే శక్తి, ఓర్పు మనకు వుండవు.

అయితే యిటువంటి ప్రశ్నలే ఉద్భవించినవారు కొందరు వాటిని గురించి తీవ్రంగా ఆలోచించారు. సమాధానం దొరికేదాకా ఆలోచించి దీనినంతటినీ నడిపించే శక్తి ఒకటి వున్నదని, అదే సృష్టికంతటికీ మూలమైన శక్తి అని, దానినే భగవంతుడంటారనీ తెలుసుకున్నారు. అలా ఆలోచనలతో మధించి ఈ సత్యాన్ని దర్శించినవారు పూజ్యశ్రీ మాస్టరుగారు.

ఇక్కడ ఒక విషయం గమనించాలి. ఇవన్నీ ఆలోచించే మనస్సు, వివేచించే బుద్ధి మానవులకు మాత్రమే వున్నది. ఈ మనస్సు ఎంతో చిత్రమైనది. ఏదైనా చేయగల శక్తి గలది. కనుక దానిని బుద్ధి ద్వారా, ఆలోచనల ద్వారా ఎలా ఉపయోగించుకుంటే అలా మనలను నడిపిస్తుంది. దురాలోచనల ద్వారా దుష్కర్మలను చేయించి, మనలను అధఃపాతాళానికి అణగదొక్కగలదు. సత్సంకల్పాల ద్వారా సత్కర్మలు ఆచరింపజేసి ఊర్ధ్వలోకాలకు తీసుకువెళ్ళగలదు. వీటన్నింటినీ మించి సర్వానికి మూలమైన పరమాత్మ తత్త్వానికి చేర్చగలదు. మనిషిని మనీషిగా, భగవంతునిగా తీర్చిదిద్దగలదు.

మరి ఇంతటి అద్భుతమైన మన శరీరాన్ని సృష్టించిన శక్తి ఎంతటి విశిష్టమైనది? అలాగాక భగవంతుడే అనుకుంటే అతడెంత మహోన్నతమైన, విశిష్టమైనవాడు! అందుకే ఈ రహస్యాన్ని లేక విచిత్రాన్ని గూర్చి తెలుసుకోవాలని తపస్సు చేసిన వారికి కలిగిన అనుభూతి – భక్తి.

ఇలా ఆలోచిస్తే మనకూ ఆ శక్తి పట్ల, భగవంతుని పట్ల ఆశ్చర్యము, ఆనందమూ కలుగక మానవు. అదే భక్తి, అదే ప్రేమ.

“ఆశ్చర్యము, ఆనందమూ మేళవించేదే భక్తి” అని పూజ్యశ్రీ మాస్టరుగారు చెబుతారు.

పూజ్యశ్రీ మాస్టరుగారు యింకా యిలా అంటారు: “మానవజన్మ అతి దుర్లభమైనది. ఈ శరీరం లేనిదే జన్మలేదు. కనుక ఈ శరీరాన్ని చక్కగా వినియోగించుకోవాలి. “మానవ జన్మకు వచ్చిందెందుకు? పిడకలు ఏరుకోవడానికా?” అని బాబా చెప్పినట్లు దీనిని దుర్వినియోగం చేసుకుంటే పిడకలేరుకున్నట్లే అవుతుంది”.

దేనినైనా అసలు ఉపయోగించకపోయినా, లేక సరిగా ఉపయోగించకపోయినా పాడవడం తథ్యం. అలాగే మన శరీరాన్ని సరిగా ఉపయోగించకపోతే అది సరిగా పనిచేయదు. అందుకని ఈ శరీరాన్ని సక్రమంగా వినియోగించుకోవాలి. ఆహార, విహారాలలో జాగ్రత్త వహించాలి. పరిశుభ్రమైన గాలి, పరిసరాల పరిశుభ్రత, శరీర పరిశుభ్రత పాటించాలి. సమయానికి తగినంత నిద్రపోవాలి. అన్నింటినీ మించి సత్ప్రవర్తన కలిగివుండాలి.

ఆలోచిస్తే ఇంతటి ప్రాముఖ్యతగల ఈ శరీరాన్ని మనము ఎంతగా దుర్వినియోగం చేసుకుంటున్నామో అర్థమవుతుంది.

అతి దుర్లభమైన మానవజన్మకు ఆధారమైన ఈ శరీరాన్ని ఎలా జాగ్రత్తగా ఉపయోగించుకోవాలో, ఏ జీవికీ లేని వివేచించగల మనస్సుతో ఎలా ఆలోచించి శాంతిని పొందాలో పెద్దలు తపస్సుతో తెలుసుకుని అనేక శాస్త్రాల ద్వారా మనకు తెలియపరచారు.

ఇవన్నీ ఆచరించాలంటే మనస్సును సరియైన విధంగా ఆలోచింపజేయాలి. అందుకు వివేచనగల బుద్ధి చెప్పినట్లు మనస్సు ప్రవర్తించేలా చేయాలి. అట్టి వివేచన కలగాలంటే సత్సాంగత్యము, సద్గురు సేవ చేయాలి. సద్గురు బోధలనాధారంగా చేసుకుని సత్సాంగత్యముతో సద్బుద్ధితో ఆలోచించి, సచ్చింతన చేస్తే మనం కోరుకునే శాంతి, తృప్తి లభిస్తాయి. అప్పుడు పరిస్థితులు ఎలా వున్నా మనస్సు చలించదు.

ఇవన్నీ జరగాలంటే శరీరమనే అతి ముఖ్యమైన పరికరం కావాలి. మరి ఇంతటి అద్భుతమైన శరీరాన్ని మనకు ప్రసాదించిన ఆ భగవంతునికి మొదటగా కృతజ్ఞత చెప్పుకోవాలి. అయితే భగవంతుడు శరీరాన్ని, అనంత శక్తిగల మనస్సునూ యిచ్చినప్పటికీ, సరియైన మార్గాన నడిపించగల సద్గురువు లేనిదే మనము సరియైన మార్గాన పయనించలేము. అలా మనలను చేయిపట్టి నడిపించగల సద్గురువు పూజ్యశ్రీ మాస్టరుగారు. కారణం ఆయన ఎవ్వరూ చెప్పనంత వివరంగా ప్రతి విషయాన్ని ఎలా వివేకంతో ఆలోచించి ఆచరించాలో తెలియజెప్పారు. అందుకని ఆయనకు కృతజ్ఞత చెప్పుకోవడము మన కనీస కర్తవ్యము. అయితే ఆయనకు కృతజ్ఞత చెప్పుకోవడమెలా? మళ్ళీ మొదటికే వచ్చాము.

ఎలాగంటే.. పైన చెప్పుకున్న విధంగా ప్రవర్తిస్తూ పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పిన వాటిని, ఆచరించిచూపిన వాటిని స్మరించుకుంటూ వుంటే ఆనందము, ఆశ్చర్యము కలిగి ఆయనయందు భక్తి, ప్రేమ కలుగుతాయి. అప్పుడు ఆయనపట్ల కృతజ్ఞతాభావం కలుగుతుంది. అట్టి భావం మనలో కలిగినపుడు ఆయన మనకు ప్రసాదించినదానికి మనమేమి సమర్పించుకుంటే ఋణం తీరుతుంది? అన్న భావన కలుగకమానదు. కనుక పూజ్యశ్రీ మాస్టరుగారికి కృతజ్ఞతగా ‘కృతజ్ఞతామహోత్సవము’ జరుపుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా వున్నది. అది మన కనీస కర్తవ్యము. లేకపోతే ఆయనను ఆశ్రయించిన మనమందరమూ కృతఘ్నులమే అవుతాము. కనుక మనకు సద్బుద్ధినీ, వివేకాన్నీ ప్రసాదించి సన్మార్గాన నడిపించే సద్గురువైన పూజ్యశ్రీ మాస్టరుగారికి కృతజ్ఞతా పూర్వకంగా ‘కృతజ్ఞతామహోత్సవము’ జరుపుకుందాము

జై సాయిమాస్టర్!

# మాతృదేవి స్మృతులు

***శ్రీమతి చిన్మయి, హైదరాబాదు***

పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లి లీలలు, వారితో తన స్మృతులను, అనుభవాలను పూజ్యశ్రీ అమ్మగారి వద్ద సేవ చేసుకున్న హైదరాబాదు వాస్తవ్యురాలు శ్రీమతి చిన్మయిగారు ఈ విధంగా తెలియజేస్తున్నారు.

జగన్మాత స్వరూపమైన గురుపత్ని పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి దివ్యసన్నిధిలో సేవ చేసుకునే భాగ్యం 2004వ సంవత్సరంలో నాకు లభించింది.

పూజ్యశ్రీ అమ్మగారు ఎంతో మృదువుగా సున్నితంగా మాట్లాడేవారు. ఏదైనా చెప్పినప్పుడు, "ఫలానా పని చేస్తారా? ఫలానా వస్తువు తీసుకువస్తారా?" అని అత్యంత ప్రసన్నవదనంతో, మందహాసంతో అడిగేవారు. భయం భయంగా, బెరుకుగా వుండే నేను కొద్దిరోజుల్లోనే ఎంతో చనువుగా వుండగలిగాను. ఎన్నడూ పూజ్యశ్రీ అమ్మగారి ముఖంలో కోపం కానీ, పనులు సరిగ్గా చేయకపోతే విసుగు కానీ కనిపించేది కాదు. రోజుల తరబడి చెప్పిన పనులు మర్చిపోయినా ఎన్నడూ కోపగించలేదు. పూజ్యశ్రీ అమ్మగారు చెప్పిన ప్రకారం చేస్తే వంటలు ఎంతో రుచిగా వుండేవి. పూజ్యశ్రీ అమ్మగారు ఎప్పుడూ ఏదో పనిలో నిమగ్నమై వుండేవారు. ఎప్పుడూ ఊరికే వుండేవారు కాదు. ఒకసారి ఖాళీ అయిన మందు సీసాలతో దేవుడి మందిరం చేశారు! అది ఎంతో అందంగా చూడముచ్చటగా వుంది.

ప్రతిరోజు ఉదయం, సాయంసమయాల్లో పూజ్యశ్రీ అమ్మగారు పూజ్యశ్రీ మాస్టరుగారికి కాఫీ నైవేద్యం సమర్పించేవారు. పూజ్యశ్రీ అమ్మగారు కాఫీ కలిపే దృశ్యం చూడటం నాకు ఎంతో ఇష్టంగా వుండేది. సున్నితమైన మృదువైన వేళ్ళతో బ్రూ కాఫీ పొడి, పంచదార సీసాల నుంచి చెంచాతో తీసి, గ్లాసులో వేసి, పాలు పోసి కలిపే ఆ దృశ్యం ఎంతో అందంగా వుండేది. అలా చూస్తూ వుండాలనిపించేది. ఆ కాఫీ ప్రసాదపు మాధుర్యం యిక చెప్పనలవికాదు! పూజ్యశ్రీ అమ్మగారి ప్రతి చర్యలోనూ అద్భుతమైన సౌందర్యం వెల్లివిరిసేది. పనిచేస్తున్నా, నవ్వినా, మాట్లాడినా, భిక్ష చేస్తున్నా, పడుకుని నిద్రపోతున్నా, ఏమి చేస్తున్నా ఎంతో అందంగా వుండేది.

అక్కడ సేవ చేసుకునే రోజుల్లో మహాశివరాత్రి వచ్చింది. నాతో పాటు సేవ చేసుకునే రాధిక, నేను, ఆరోజు ఉపవాసం వుందామనుకున్నాం. మధ్యాహ్నం పూజ్యశ్రీ మాస్టరుగారికి నివేదన సమర్పించాక పూజ్యశ్రీ అమ్మగారు ఆ నివేదన తీసుకురమ్మని చెప్పి, స్వయంగా అన్నం కలిపి మా ఇద్దరికీ ముద్దలు పెట్టారు. శ్రీ వెంకయ్య స్వామి చరిత్రలో ఒక భక్తురాలు, ఆరోజు మహాశివరాత్రి కనుక ఉపవాసం వున్నానంటే ఆ సద్గురువు, "అబ్బే, అన్నం చూస్తుండ్లా, భిక్ష చెయ్!" అని ఆమె చేత అన్నం తినిపించారని చదివినది గుర్తుకొచ్చింది. ఆవిధంగా మహాశివరాత్రి పర్వదినాన శ్రీ అన్నపూర్ణేశ్వరి స్వయంగా తమ చేతితో పెట్టిన భిక్షపొందిన మహాభాగ్యం మాకు

కలిగింది.

ఒకసారి పని చేసుకుంటూ అనుకున్నాను– 'పూజ్యశ్రీ అమ్మగారికి మన మనసులో అనుకున్నది తెలుస్తుంది కదా! ఇప్పుడు నన్ను పిలిచి నాకు ఏమైనా తీపి పదార్థం పెట్టాలి' అని! వెనువెంటనే పక్క గదిలోంచి పూజ్యశ్రీ అమ్మగారు కబురు పంపారు, 'చిన్మయికి తినడానికి హాట్ కావాలా? స్వీట్ కావాలా? లేక రెండు కావాలా' అని!! ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాను. ఆశ్చర్యము, భయము, రకరకాల భావాలు చుట్టుముట్టాయి. అలా పూజ్యశ్రీ అమ్మగారికి పరీక్ష పెట్టినందుకు నాకే చిన్నతనంగా అనిపించింది.

ఒకసారి పూజ్యశ్రీ అమ్మగారి గదిలోకి వెళ్లేసరికి వారు తదేకంగా బాబా ఫోటోను చూస్తున్నారు. ఏదో చెబుదామని వెళ్ళిన నేను ఆశ్చర్యంగా అలాగే చూస్తూ నిలబడ్డాను. 'పూజ్యశ్రీ అమ్మగారు బాబాతో మాట్లాడుతున్నారా!' అన్నట్టుంది ఆ దృశ్యం. నేను అలా అనుకున్న తక్షణమే పూజ్యశ్రీ అమ్మగారు నావైపు చూసి చిరునవ్వు నవ్వారు. నాకు చెప్పలేనంత ఆనందం కలిగింది. 'మనలో వచ్చే భావానికి జవాబు యివ్వడమంటే యిదే కదా?!' అనిపించింది.

పూజ్యశ్రీ అమ్మగారి సేవ నుంచి వచ్చేశాక కొంతకాలానికి మరలా వారి దర్శనానికి వెళ్లాను. సాయంత్రం సమయంలో సత్సంగహాలులో చాలామంది భక్తులు వున్నారు. ఆ హాలులో అడుగుపెట్టగానే, నాకు ఎంతో ఆనందం కలిగి 'నేను ఈ వైకుంఠంలో వున్నానా?! ఈ తల్లికి సేవ చేసుకున్నానా?!' అని అనుకుంటూవుంటే ఆ రోజులు గుర్తుకు వచ్చి కళ్ళలో నీళ్లు తిరిగాయి. అప్పుడే పూజ్యశ్రీ అమ్మగారు లోపలినుంచి దర్శనమివ్వడానికి హాలులోకి వస్తూనే నా వైపు చూసి చిరునవ్వు నవ్వారు. నాకు చెప్పలేనంత ఆనందం కలిగింది.

పూజ్యశ్రీ అమ్మగారు చేసిన సత్సంగంలో నాకు గుర్తున్న కొన్ని విషయాలు మనవి చేసుకుంటాను.

1. "అందరూ మొదట సేవ చేసుకోవాలని వస్తారు, కానీ వచ్చాక వాళ్ళ సంస్కారాలు పనిచేయడం మొదలుపెడతాయి, భావాలు మారిపోతాయి. అంటే మొదట పరిపూర్ణమైన భావంతో సేవ చేసుకోవాలని కోరుకుంటారు. తర్వాత భావాలు మార్పు వల్ల ఆ సేవ పోగొట్టుకునే స్థితి కూడా అదే కలుగజేస్తుంది!"

2. "ఎవరి తప్పులనూ ఎంచవద్దు, అది ఎవరికీ ఇష్టముండదు. మనలో ఒక బలహీనత వుంటే యింకొకరిలో యింకొకటి వుంటుంది కదా! మరి ఎందుకు విమర్శించడం? ఆలోచన ముఖ్యం. అవతలివాడు నీ మంచితనాన్ని అలుసుగా తీసుకుంటే అప్పుడు చెప్పాలి, 'ఒరేయ్ నువ్వు అనవసరంగా అంటున్నావు అని!' అంతేగాని అవతల వాడి మీద ద్వేషం పెంచుకోకూడదు."

3. "చెడు ఆలోచన వచ్చిన ప్రతిసారీ ప్రార్థన చేసుకోవాలి. అసలు మనసుకి ఎప్పుడూ చెడు ఆలోచనలు ఎందుకు వస్తాయి? కోట్ల జన్మల కుసంస్కారాలు మంచి పనులను వ్యతిరేకిస్తూనే వుంటాయి. ఒక గంట కూర్చుని భజన చేశావనుకో, 'ఏమిట్రా ఇంకా ఎంతసేపు చేస్తావు?' అంటుంది మనసు.. ఎన్నో వేల జన్మల్లో పేరుకుపోయిన చెడ్డ సంస్కారాల వలన!!"

4. "మహాత్ములు చెప్పిన దానిని గుడ్డిగా ఆచరించాలి. కానీ చెడ్డ సంస్కారాల వల్ల మనకు సొంత ఆలోచనలు వస్తాయి. అలా వచ్చినప్పుడల్లా మన్నించమని ప్రార్థన చేసుకోవాలి. మనలను మనం శత్రువులా చూసుకోవాలి. అంటే మనలో భావాలను నిశితంగా పరిశీలించి, నిష్కర్షగా ఆత్మవిమర్శ చేసుకోవాలి. మనల్ని పొగిడేవారు, మనకి అపకారం చేస్తున్నవాళ్ల కంటే ప్రమాదకరం. మనల్ని విమర్శించేవాడే మనకు నిజమైన మిత్రుడు" అనేవారు పూజ్యశ్రీ మాస్టరుగారు.

5. "సద్గురువు ఇంటిలో జరిగే దేనిని గురించైనా విమర్శించకూడదు. ఏమి జరిగినా పట్టించుకోకూడదు. ఒకవేళ ఏదైనా విషయం చెప్పాలంటే, ఎవరైతే దానిని సరిదిద్దగలరో వారికి మాత్రమే చెప్పాలి. తన పని ఏదో అది డ్యూటీలాగా చేసుకుంటూ వెళ్ళిపోవాలి. పక్కకు చూశావా పడిపోతావ్! నీకు నిర్దేశించబడిన డ్యూటీ నుంచి పక్కకు తొలగిపోతావు."

పూజ్యశ్రీ అమ్మగారి స్వరం ఎంతో మధురంగా

***మిగతా 24వ పేజీలో***

# అమ్మమాట– బంగారు బాట

శ్రీమతి శ్రీదేవి

మన మాతృదేవి అలివేలు మంగామాత బోధనాశైలి యెంతో సులభమైన పదాలతో, అందరికీ అర్థమయ్యే రీతిలో వుంటూ వినేవారి మనసులలో బాగా నాటుకొని, వారి ప్రవర్తనలో చక్కని మార్పు కలిగించేదిగా వుండేది.

ఒక సందర్భంలో శ్రీ అమ్మగారు భార్యాభర్తలు – గృహనిర్వహణ అనే విషయం గురించి మాట్లాడుతూ యిలా చెప్పారు –

“కుటుంబంలో భార్యాభర్తలిద్దరూ సమానులే. ఒకరు యెక్కువా కాదు, మరొకరు తక్కువా కాదు. వీరు యిరువురూ కలసిమెలసి ఐకమత్యంగా వుంటేనే కుటుంబంలో అందరికీ న్యాయం చేయగలుగుతారు. ఎందుకంటే కుటుంబంలోని అందరూ వీరి పైననే ఆధారపడి జీవిస్తుంటారు. కుటుంబం అనే బండి ముందుకు సాగాలంటే ఆ బండికి కట్టిన రెండు యెద్దులలో ఒకటి ఒకవైపు, రెండవది మరొకవైపు లాగుతూ పోతుంటే ఆ బండి యెలా ముందుకు సాగుతుంది? ముందుకు సాగకపోగా బండి తలక్రిందులై పడిపోయే ప్రమాదం వుంది. అలాగే భార్యాభర్తల మధ్య సమన్వయం లోపిస్తే కుటుంబమే విచ్ఛిన్నమైపోయే ప్రమాదం వుంది. పూర్వకాలంలో స్త్రీలు ప్రాథమిక పాఠశాలలో చదువుకొనటం వరకే పరిమితమై వుండేవారు. హైస్కూళ్ళలో, కాలేజీల్లో చదువుకొనేవారు చాలా తక్కువ. అయినా యెంతో విజ్ఞానవంతులుగా వుండేవారు. పెద్దలనుండీ యెన్నో మంచి విషయాలను తెలుసుకొంటూ కుటుంబ నిర్వహణ నుండి సమాజసేవ వరకూ అన్నింటినీ యెంతో సమర్థవంతంగా నిర్వహించుకొనగలిగిన జ్ఞానం కలిగి వుండేవారు. ముఖ్యంగా ఆ రోజుల్లో చిన్నవాళ్ళు పెద్దలపట్ల యెంతో వినయంతో, గౌరవంతో మెలిగేవారు. పెద్దలు యిచ్చే సలహాలకు యెంతో విలువ యిచ్చేవారు. ఇప్పుడు యెవరికి వారే పెద్దలు!! పైగా, ‘ఈ పాతకాలపు పెద్దలకేమి తెలుసు?’ అనే చులకన భావం పెద్దల పట్ల వున్నవారు కూడా లేకపోలేదు.

ఈనాటి స్త్రీలు పాఠశాలలకు, కళాశాలలకు వెళ్ళి చదువుకుంటున్నారు. మగవారితో సమానంగా వుద్యోగాలు చేయటం, దేశాలను పాలించటం కూడా చేస్తున్నారు. కానీ నిత్యజీవితంలో ఆచరణలో ధర్మం అనేది కనిపించటం లేదు. అందరూ కేవలం ధనసంపాదనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు తప్ప కుటుంబం పట్ల, సమాజం పట్ల తమ ధర్మాన్ని, కర్తవ్యాన్ని గుర్తించి నడచుకొంటూ వున్నారా? గృహస్థులలో ధర్మం లోపిస్తే సమాజంలో శాంతి యెక్కడుంటుంది? దాని ఫలితమే మనుషుల మధ్య కనిపించే యీ గొడవలు, కొట్లాటలు! కుటుంబాలలో కూడా యీ ధర్మం లోపించటం అనే విషయం వలననే యెంతో అశాంతితో కుటుంబసభ్యులు జీవిస్తుండటం చూస్తున్నాము. అంతే కాదు, యెన్నో అనర్థాలు కూడ వాటిల్లుతున్నాయి. పిల్లలలో నైతిక ప్రవర్తన లోపించటం జరుగుతున్నది. భార్యాభర్తలు తమ పిల్లలకు సత్ప్రవర్తన నేర్పించటం విషయంలో శ్రద్ధ వహించకపోవటమే యిందుకు కారణం. ఇంట్లోని పెద్దలను గౌరవంతో ఆదరించాలన్న కనీస ధర్మం కూడా

పాటించకుండా, వారిని అడ్డు తొలగించుకొనటానికి వృద్ధాశ్రమాలకు పంపివేయటం జరుగుతున్నది. కనుక గృహస్థులు తమ స్వార్థబుద్ధితో తమ సుఖసౌఖ్యాలకు మాత్రమే ప్రాధాన్యత యివ్వటం మాని కుటుంబం పట్ల, సమాజం పట్ల కూడా తమ బాధ్యత చక్కగా నిర్వర్తించటమే ధర్మం. అప్పుడే అందరూ సుఖశాంతులతో జీవించగలుగుతారు.

ఒకనాడు సత్సంగ సమయంలో మాతృశ్రీ నిలయంలో భక్తులంతా అమ్మగారి చుట్టూ కూర్చుని వున్నారు. ఒక మహిళ శ్రీ అమ్మగారిని యిలా ప్రశ్నించింది – "అమ్మా! మానవుడు యెంతో పుణ్యఫలంగా వచ్చిన తన మనుష్య జన్మను మోక్షసాధనకు వుపయోగించుకొనాలని అంటారు కదా! మునులు తమ కుటుంబాలను, ప్రపంచాన్నీ వదిలేసి కొండలలోకి, అడవులలోకి వెళ్ళి యేకాంతంలో సాధన చేసి మోక్షాన్ని సాధిస్తారు. అయితే మావంటి వారము వారివలె యీ బంధాలను వదిలివేయలేము. ఈ విధంగా వైరాగ్యం లేకుండా మేము మోక్ష సాధన యెలా చేయగలము అని అనిపిస్తుంది. ఇంక మా గతి యేమిటి?"

శ్రీ అమ్మగారు యిలా అన్నారు: "ఆధ్యాత్మిక సాధన చేయాలంటే తప్పనిసరిగా సర్వసంగ పరిత్యాగం చేసి తీరాలని చెప్పబడలేదు. ఎందరో ఋషులు కూడా గృహస్థాశ్రమంలో వుంటూ తరించిన వారిని మనం చూస్తుంటాం. ఆధ్యాత్మికత, లౌకికత వేరు వేరు అంశాలు కానేకావు. గృహస్థాశ్రమంలో వుంటూ గృహస్థధర్మాలను పాటిస్తూ సాధనలో ముందుకు సాగిపోవచ్చు. స్త్రీలు ముఖ్యంగా ఒక విషయం బాగా జ్ఞాపకం పెట్టుకొనాలి. ముందుగా తన సంసార బంధాలు తన సాధనకు అడ్డుగా వున్నాయన్న భావన పూర్తిగా తొలగించుకొనాలి. తన గృహం ఒక దేవాలయం గాను, కుటుంబ సభ్యులు అందరూ పరమాత్మ స్వరూపులుగాను భావన చేయాలి. ఆ పరమాత్మకే తాను సేవలు చేస్తున్నానని అనుకొంటూ యింటి పనులు చేసుకోవాలి. ఈ భావన వలన ప్రతి నిముషమూ సాధనలో సాగుతున్నట్లే కదా? ఈ విధమైన సాధన వలన స్త్రీలు సులభంగా తరించగలరనటంలో యేమాత్రం సందేహం లేదు. అయితే 'కుటుంబ సభ్యులందరినీ దైవ స్వరూపులుగా భావించటం సాధ్యమా' అనిపిస్తుంది. కాని అభ్యాసం వలన క్రమక్రమంగా ఆ భావన నిలుపుకొనగల శక్తి తప్పకుండా లభిస్తుంది".

"అమ్మా! మన చుట్టూ మెలిగే మనుష్యుల ప్రభావం మనపై యెంతగానో వుంటుందని శ్రీమాస్టరుగారు అంటారు కదా! ఈ రోజులలో నూటికి తొంభై మందిలో దైవచింతన అనేది కొంచెం కూడా కనిపించటం లేదు. నిద్ర లేచింది మొదలు అందరూ లౌకిక కార్యకలాపాలలోనే మునిగి తేలుతున్నారు. ఇటువంటి వారి సాంగత్య ప్రభావం సాధన చేయాలన్న సంకల్పంతో వున్న మా వంటి వారి మీద పడకుండా వుండాలంటే మేము యేమిచేయాలి?" అంటూ ఒక మహిళ తన ఆవేదన వ్యక్తం చేసింది.

అమ్మగారు యిలా చెప్పారు: "పాశ్చాత్యుల ప్రభావం వలన మనం మన సంస్కృతి, ఆచారాలకు దూరమైనాము. ఆధ్యాత్మిక సాధన, దైవభక్తి – యివన్నీ మూఢాచారాలనీ, వాటిని నమ్మేవారు మూర్ఖులనీ చెపుతూ బ్రిటిష్ వారు మన ప్రజలలో నాస్తిక భావాలు ప్రచారం చేశారు. వాళ్ళ ప్రభావం వలన మనం మన సత్సంప్రదాయాలకు కూడా దూరమైపోయాం. అంతదాకా యెందుకు? ఈనాడు మన అలవాట్లు యెలా వున్నాయి? ఉదయాన్నే కాఫీలు, టీలు త్రాగటం, టిఫిన్లు చేయటం యింతకు ముందు వున్నాయా? ఉదయాన్నే యేదో ఒక వూరగాయ పచ్చడి, పెరుగుతో రాత్రి వండిన అన్నమే తినేవాళ్ళం. ఆ ఆహారం కడుపులో యెంతో చల్లగా హాయిగా వుండేది. ఎంతో శక్తి నిచ్చేది. ఈనాడు డాక్టర్లందరూ కూడా యిటువంటి ఆహారమే ఆరోగ్యకరమని చెపుతున్నారు. కాఫీలు, టీలు అనారోగ్యకరమనీ, దోసెలు, పూరీలు – యిలాంటి నూనెతో వండిన పదార్థాలు శరీరంలో కొవ్వును పెంచి యెన్నో రకాల రోగాలకు కారణమౌతున్నాయని హెచ్చరిస్తున్నారు.

కాబట్టి మనం మన సంస్కృతి యెంత గొప్పదో,

మన సంప్రదాయాలు యెంతటి వున్నతమైనవో గుర్తించి ఆచరించాలి. మరల మనం మన ఆధ్యాత్మిక జీవిత ప్రయాణాన్ని ఆరంభించాలి. అందుకు గురువు అవసరం. లోకంలో మోసగాళ్ళెందరో తమ తమ స్వార్థ ప్రయోజనాల కోసం తమను తాము గురువులుగా ప్రకటించుకుంటున్నారు. అటువంటి నకిలీ గురువుల బారిన పడకుండా సద్గురువును యెలా గుర్తించి, తెలుసుకుని ఆశ్రయించాలో పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారు తెలియపరచారు. ఎందరో సద్గురువుల జీవిత చరిత్రలను వ్రాసి మనకందించారు. అటువంటి సద్గురువులను ఆశ్రయించి వారు చెప్పిన విధంగా నడచుకొంటూ సాధన చేయడం ద్వారా ముక్తిమార్గంలో ముందుకు సాగిపోవచ్చు."

"మహాత్ములను ఆశ్రయించి, వారి సన్నిధిలోనే జీవితమంతా గడపాలన్న భక్తి భావంతో వారిని చేరేవాళ్ళు వుంటారు. అయితే గురు సన్నిధిలో నిలవగలగటం అంటే కత్తిమీద సాము వంటిదే! వారిని యెంతో శ్రద్ధాభక్తులతో అనుసరించవలసి వుంటుంది. అక్కడ వుండే గురుబంధువుల సాహచర్యంలో యెదురయ్యే సాధక బాధకాలను భరించవలసి వుంటుంది. పూజ్యశ్రీ మాస్టరుగారు ఒక సందర్భంలో యిలా అన్నారు, "ఇక్కడ వుండే వారికి నేను కొన్ని సమయాలలో వారికి యిష్టంలేని పరిస్థితులను కల్పిస్తాను. దానివలన వారిలోని బలహీనతలు బయటపడేలా చేసి వాటిని సరిదిద్దుకునేలా చేస్తాను." శ్రీసాయి కూడా భక్తుల భక్తివిశ్వాసాలను పరీక్షిస్తూ వారిలోని లోపాలను సరిదిద్దే ప్రయత్నం చేశారు. మసీదులోకి వచ్చిన ముసలి మేకను కత్తితో నరకవలసిందిగా చెప్పినప్పుడు బడేబాబా, శ్యామాలు ఆయన ఆజ్ఞ పాటించలేదు. దీక్షిత్ ఒక్కడే ముందుకు వచ్చాడు. కానీ తర్వాత యెవరూ దానిని చంపనవసరం లేకుండానే అది మసీదు బయట ప్రాణం విడిచేలాగా దానిని అనుగ్రహించారు. ఈ విధంగా గురువు పట్ల వారి భక్తి విశ్వాసాలకు పరీక్షపెట్టారు శ్రీసాయి. సద్గురు సన్నిధిలో యెలా నడచుకొనాలో తెలియజేస్తూ పూజ్యశ్రీ మాస్టరుగారు 'సాయి సన్నిధి' అనే గ్రంథం రచించారు."

అమ్మగారు యీ విషయంగా మాట్లాడుతూ హెచ్చరికగా మరొక ముఖ్యమైన విషయాన్ని వివరించారు–

"మానవుడు సంఘజీవి. శ్రీమాస్టరుగారు చెప్పినట్లు మన చుట్టుప్రక్కల వున్నవారి ప్రభావం మనపైన యెంతగానో వుంటుంది. అందువలన వారిలో కూడా మార్పు తీసుకురావటానికై మన వంతు కృషి మనం చేయాలి. అలాంటి మార్పు సత్సంగాలు చేయటం ద్వారా తప్పక వస్తుంది. అందువలననే శ్రీమాస్టరుగారు సత్సంగాలను యెంతగానో ప్రోత్సహించారు. ఈ సత్సంగాలు జరుపుకొనటమనే సంప్రదాయం యీనాటిది కాదు. ముక్తపురుషులయిన శౌనకాది మునులు కూడా అంతా ఒక చోట చేరి దైవ సంబంధములయిన ప్రసంగాలు, సత్సంగాలు జరిపేవారని మనం మన పురాణాల ద్వారా తెలుసుకొంటూ వుంటాము. అందువలన భక్తులు వీలయినంత తరచుగా నలుగురూ ఒకచోట చేరి సద్గ్రంథపఠనం, మహాత్ముల జీవితచరిత్రలు, మహనీయుల బోధలు చదువుకుంటూ ఆధ్యాత్మిక చర్చలు చేసుకుంటూ వుండాలి. ఇలా చేస్తుంటే మన సమాజంలో మనం ఆశించిన మార్పు తప్పకుండా వస్తుందనటంలో యెలాంటి సందేహం లేదు".

ఈ విధంగా మన మాతృదేవి అలివేలు మంగామాత భక్తులకు ముఖ్యంగా మహిళలకు గృహ సంబంధములయినవి, సాధనాపరమైనవి అయిన అనేక విషయాలను తెలియపరుస్తూ వారిని సాధన పట్ల నిరంతరం అప్రమత్తులను చేస్తుండేవారు. ఆ మహనీయురాలు చేసే బోధలు మనకు మార్గదీపికలై మనలను జ్ఞానమార్గంలో ముందుకు నడిపించాలని ఆశిస్తూ, ఆమె చరణ కమలాలకు శతసహస్ర నమస్కారాలర్పిస్తున్నాను.

జై సాయిమాస్టర్ !

# వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

**శ్రీమతి అడిదం వేదవతి**

శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.

## 15వ ప్రసంగము

### మోక్షానికి నలుగురు ద్వారపాలకులు

స్వా॥ని॥ ప్రకాశానందస్వామివారు చెప్పినది నిజమే. సంతోషము మోక్షానికి వున్న ద్వారపాలకులలో ఒకటి.

**శ్లో॥ మోక్షద్వారే ద్వారపాలాః**
**చత్వారః పరికీర్తితాః।**
**శమో విచారః సంతోషః**
**చతుర్థః సాధుసంగమః॥**

(యోగవాశిష్ఠము)

భావం: 'మోక్ష ద్వారానికి ద్వారపాలకులు నలుగురు. శమము, తత్త్వవిచారము, సంతోషము, సాధుసంగము' అని శాస్త్రాలు చెబుతున్నాయి.

### శమః

**'సదైవ వాసనాత్యాగః శమోఽయమితి శబ్దితః'** అంటే 'నిరంతర వాసనా త్యాగము (ఎల్లవేళలా వాసనలను త్యజించడం) శమమని చెప్పబడుతున్నది.

శమమంటే మనస్సును నిరోధించడం. సంకల్ప, వికల్ప వృత్తులతో కూడిన మనస్సును విషయాల నుండి నిగ్రహించడం. సంకల్ప, వికల్పాలకు అనాది అయిన అజ్ఞానము నుండి పుట్టిన వాసనే కారణము. వాసన వశంలోనే సంకల్ప వికల్పాలు కలుగుతాయి. ఈ వాసన నుండి ముక్తిని పొందమని యోగవాశిష్ఠంలో చెప్పబడింది.

**శ్లో॥ అసంగ వ్యవహారిత్వాత్ భవభావన వర్జనాత్।**
**శరీరనాశ దర్శిత్వాత్ వాసనా న ప్రవర్తతే॥**

భావం: నిస్సంగత్వంలో వుండడము, ప్రపంచంలో మమకారబుద్ధిని విడిచిపెట్టడం, శరీరము యొక్క అశాశ్వతత్వాన్ని మాటిమాటికి మరువకుండటం – వీటివలన మలినవాసనలు జనించవు.

కాబట్టి కారణాన్ని నిరోధించడం ద్వారా కార్యాన్ని నిరోధించండి. అంటే – వాసనా నిరోధము ద్వారా సంకల్ప వికల్పాలను నిరోధించడమే శమము.

## విచారః

**శ్లో॥ కోఽహం కథమిదం జాతం కో వై కర్తా చ విద్యతే।**
**ఉపాదానం కిమస్తీహ విచారః సోఽయమీదృశః॥**

భావం: నేను ఎవడిని? ఈ జగత్తు ఎలా ఉద్భవించింది? దీనికి కర్త ఎవరు? దీనికి ఉపాదాన కారణమేమిటి? ఈ నాలుగు పదార్థాలకూ సంబంధించిన భావాలే విచారము.

**కోఽహమ్**? :– "నేను ఎవడిని?" ఈ ఆలోచన ముముక్షువు ఎల్లప్పుడూ చేస్తూనే వుంటాడు. ఈ భావం పరిపక్వమవడంతోటే 'నేను ఈ దృశ్యజగత్తుకి భిన్నమైనవాడిని!' అంటే దేహము, ఇంద్రియాలు, ప్రాణాలు, మనస్సు, బుద్ధి, కుండ మొ॥న వాటి కంటే నేను అతీతుడిని. సర్వసాక్షిని!' అనే జ్ఞానము కలగడమే 'కోఽహం' భావము యొక్క ప్రయోజనం.

**కథమిదం జాతం** :– 'ఈ దృశ్య ప్రపంచమెలా ఉద్భవించింది?' ఈ విషయం యొక్క విమర్శనలో పరిపక్వము చెందిన కొద్దీ తాను ఇలా భావిస్తాడు –

మాయావిశిష్టమైన బ్రహ్మము జీవజాతము యొక్క శుభాశుభ అదృశ్యములైన ఫలితాలను దృష్టిలో పెట్టుకుని 'ఏకోఽహం బహుస్యామ్' అనే సంకల్పాన్ని పొందింది. అప్పుడు ఆ మాయావిశిష్టమైన బ్రహ్మము నుండే ఆకాశము మొ॥న జడపదార్థాల జగత్తు ఉద్భవించింది. ఆ జగత్తు నా కంటే భిన్నమైనది'.

**కో వై కర్తా చ విద్యతేః** 'దీనికి కర్త ఎవరు?' ఈ భావన పరిపాకము చెందిన వెంటనే తర్కానికి అందనిది, అచింత్యము (ఆలోచింపనలవిగానిది) అయిన జగత్ యొక్క రచన అల్పమైన శక్తిగల జీవుడు చేయలేడు. సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడైన ఈశ్వరుడే మాయతో చేయబడిన జగత్తును సృష్టించాడని తెలుస్తుంది.

**ఉపాదానం కిమస్తీహ** :– 'ఈ జగత్తుకు *ఉపాదాన కారణమేమిటి?'

ఈ భావనాపరిపాకంలో అచింత్యము, అనిర్వచనీయము అయిన అవిద్య ఉపాదానకారణమని తెలుతుంది. **ఘటాదులకు ***కపాలాదులు, #పటాదులకు ##తంతువులు ఎలా ఉపాదాన కారణాలో అలానే జగత్తుకు ఉపాదాన కారణం అవిద్య. ఈ అవిద్య నాలో లోతుగా (అధ్యస్తం) వున్నది. దానికి అధిష్ఠానమైన సాక్షిని నేను. ఈ దివ్యమైన వివేకమే విచారము.

## సంతోషః

**శ్లో॥ సంతోషం పరమాస్థాయ సుఖార్థీ సంయమీ భవేత్।**
**సంతోషమూలం హి సుఖం దుఃఖమూలం విపర్యయః॥**

భావం: పరమ సంతోషాన్ని పొంది సుఖాన్ని అనుభవించగోరే మానవుడు సంయమమును పాటించాలి. సుఖానికి మూలం సంతోషం. సంతోషం లేకపోవడం దుఃఖానికే కారణము.

ఈ విషయంలో శ్రీమద్భాగవతంలో ధర్మరాజుకు నారదుడిలా చెప్పాడు:

**శ్లో॥ పండితా బహవో రాజన్ బహుజ్ఞాః సంశయచ్ఛిదః।**
**సదసస్పతయోప్యేకే హ్యసంతోషాత్పతన్త్యధః॥**

భావం: ఓ రాజా! విద్వాంసులు, వేదాలు, శాస్త్రాలు మొ॥న వాటిని అధ్యయనం చేసినవారు, సంశయాలను పోగొట్టగలిగినవారు చాలామంది వున్నారు. వారు కూడా అసంతృప్తి వలన అథఃపతనాన్ని పొందుతారు.

## సాధుసంగమః

**'సాధ్నోతి పరకార్యమితి సాధుః'** అని చెప్పారు. 'పర' శబ్దానికి 'పరులైన (ఇతరులైన) మానవులని, పరలోకమని కూడా అర్థం చెప్పవచ్చు. ఇతరుల దుఃఖాన్ని పోగొట్టేవారు అని కాని, పరలోకం కోసం (అంటే మోక్షం కోసం)

---

*ఉపాదానకారణము – ఏ కారణం లేకుంటే కార్యం పుట్టదో దానిని 'ఉపాదానకారణం' అంటారు.

**ఘటాదులు – కుండ మొ॥నవి, ***కపాలాదులు – డిప్పలు, #పటాదులు – వస్త్రాలు మొదలగునవి, ##తంతువులు – దారాలు

ప్రయత్నం చేసేవారు అని గాని 'సాధు' శబ్దానికి అర్థము. గృహస్థాశ్రమము మొ॥న ఆశ్రమాలలో వుండి ఆయా ఆశ్రమాల ధర్మాలను యథాతథంగా పాటించేవారు కూడా సాధువులని పిలువబడతారు.

వాయుపురాణం ఇలా చెబుతోంది–

**శ్లో॥ విద్యాయాస్సాధనాత్ సాధుః బ్రహ్మచారీ గురోర్హితః।**
**క్రియాణాం సాధనాచ్చైవ గృహస్థః సాధురుచ్యతే॥**

భావం: గురువు దగ్గర విద్యను అధ్యయనం చేసేవాడు బ్రహ్మచారి. అతడు కూడా సాధువే. గృహస్థ ధర్మాలను పాటించే గృహస్థు కూడా సాధువే!

**శ్లో॥ సాధనాత్తపసోఽరణ్యే సాధుర్వైఖానసః స్మృతః ।**
**యతమానో యతిః సాధుః స్మృతో యోగస్య సాధనాత్ ॥**

భావం: అరణ్యంలో గాని, గ్రామం బయటగాని వుండి తపస్సు చేసే వానప్రస్థాశ్రమంలో వున్నవాడు కూడా సాధువే. సన్యాసాశ్రమంలో వుండి పరమాత్మను పొందడానికి సాధనాలైన యోగసాధనాదుల ద్వారా ప్రయత్నించే యతి కూడా సాధువనబడతాడు. ఇలా ఆశ్రమ ధర్మాలను ఉత్తమంగా పాటించేవాడు సదాచారులైన వారి సమాగమం చేత అసుర సంపదలైన అన్ని రకాల దుష్కృత్యాలను వదిలివేసి సదాచారాన్ని అంటే దైవసంపద అనే ఫలాన్ని అతి త్వరలో పొందుతాడు. శాస్త్రాలిలా ఘోషిస్తున్నాయి–

**శ్లో॥ సాధూనాం దర్శనం పుణ్యం తీర్థభూతాశ్చ సాధవః ।**
**తీర్థం ఫలతి కాలేన సద్యః సాధుసమాగమః ॥**

భావం: సాధు దర్శనం చేత పుణ్యం కలుగుతుంది. సాధువాలు, పుణ్యస్థలాలు, పుణ్యక్షేత్రాలు చాలాకాలానికి ఫలాన్నిస్తాయి. కానీ సత్పురుష సమాగమం త్వరలోనే ఫలాన్నిస్తుంది.

## పేదవారిని పీల్చి ధనాన్ని సంపాదించడం రాక్షస ప్రవృత్తి

స్వా॥ప్ర॥ జయంతీభాయికి జీవితాన్ని గడుపుకోడానికి అవసరమైన ధనమున్నది. అయినా సంతోషము లేదు.

పూర్వము వైద్యము, జ్యోతిషము మొ॥న కళలు పరోపకారం కోసం ఉపయోగపడేవి. ఎందుకంటే పూర్వము ధాన్యము పుష్కలంగా పండుతూ వుండేది. ఆ ధాన్యాన్ని భుజించేవారు తక్కువమంది వుండేవారు. కాబట్టి జీవిత నిర్వహణకు ఏ బాధా కలిగేది కాదు. కానీ ఈరోజులలో ఆ పరిస్థితులు మారడం వల్ల జీవిత నిర్వహణకు సరిపోయేంత ధనం సంపాదించడంలో తప్పు లేదు.

ఇప్పుడైనా (ధనవంతుడిని) లక్షాధికారిని కావాలనే భావంతో పేదవారిని పీల్చి పిప్పిచేసి ధనాన్ని సంపాదించడం పాపం. పేదలను పీల్చి పిప్పిచేయకుండా, అవినీతికి పాల్పడకుండా ఎక్కువ ధనవంతుడవడం అసంభవం. అక్రమ పద్ధతులలో ధనాన్ని సంపాదించడానికి ఎవరికీ అధికారము లేదు. భగవంతుడు మానవులందరికీ సమానమైన అధికారాన్ని యిచ్చివున్నాడు. భగవంతుడు రాజుకైనా, ధనవంతుడికైనా మూడు కళ్ళు, నాలుగు చేతులూ యివ్వలేదు కదా! పేదవాడికి రెండు కళ్లు, రెండు చేతులు – వీటిలో ఏమీ తక్కువ యివ్వలేదు కదా! అలాగే భోజనము మొ॥నవి కూడా సమానమే. కాబట్టి తనకు ఎంత అధికారమున్నదో తెలిసికొని ప్రపంచంలో మెలగాలి. తన హద్దును మీరి సంచరించేవాడు దేవుడి దండనకు పాత్రుడౌతాడు. ఇవాల్టి పరిస్థితి చూడండి. ప్రక్కనే ధనవంతుడు అవినీతి ద్వారా లక్షలు, కోట్లు సంపాదించి భోగవిలాసాలలో మునుగుతూ తేలుతూ వుంటాడు. ఆ ప్రక్కనే లక్షలకొలదీ పేదలు 'అన్నమో రామచంద్రా!' అని ఆకలితో అలమటిస్తూ వుంటారు. అయినా ఆ ధనవంతుడు వారిని పట్టించుకోడు. అంతేకాదు. వారంటే ఒక చులకన, తిరస్కార భావము కలిగి వుంటాడు. నైతికమైన సంపాదనతో పేదలకు సహాయం చేయడం దైవగుణము. తన కడుపు నింపుకోడానికే సంపాదించడం అసురవృత్తి. ఇతరులను పీడించి సంపాదించడం రాక్షసవృత్తి.

శ్రీమద్భాగవతంలో చూడండి–

***శ్లో॥ యావత్ భ్రియేత జఠరం తావత్ సత్త్వం తు దేహినామ్।***
***అధికం యోఽభిమన్యేత స స్తేనో దండమర్హతి॥***

భావం: ప్రతి ప్రాణికీ కడుపు నింపుకునే హక్కు వున్నది. అంతకంటే ఎక్కువ కూడబెట్టేవాడు దొంగ, దండనకు పాత్రుడు.

**ప్రియము(ఇష్టము) కాని హితాన్ని చెప్పేవాడు, వినేవాడు దొరకడం కష్టం**

ఇది విని నిత్యానందులవారు నవ్వుతూ ఇలా అన్నారు–

మీరు ఇంత కఠినంగా చెబుతున్నా గూడా వారికి కష్టము కలగడం లేదు.

***శ్లో॥ లభ్యతే ఖలు పాపీయాన్ నరోఽసుప్రియవాగిహ।***
***అప్రియస్య హి పథ్యస్య వక్తా శ్రోతా చ దుర్లభః॥***

(మహాభారతం)

భావం: 'ఈ ప్రపంచంలో అనుకూలములైన ప్రియవాక్యాలను (మనకు నచ్చినట్లు మాట్లాడేవారు) పలికే పాపాత్ములు సులభంగా దొరుకుతారు. కానీ అప్రియమైనవి (వినడానికి ఇష్టముండనివి) హితకరమైన (మేలు చేసే) విషయాన్ని చెప్పేవాడు, వినేవాడు దొరకడం కష్టం' అని మహాభారతం చెబుతోంది.

బ్రహ్మహత్య మొ॥న మహాపాపాలు చేసేవారు కూడా స్వార్థం కోసం ప్రజలకు నచ్చేటట్లుగా మృదువైన, తీయనైన సంభాషణలు చేయగలరు. నిస్పృహుడు మాత్రమే హితకరమైన వాక్యాలను పలుకగలడు.

**- సశేషం**



## మానవులు శ్రమించి జీవించాలన్నారు సాయి

౦5వ పేజీ తరువాయి

ప్రాణాయామము, ధ్యానము మొ॥న వాటికి బాబా ఏమాత్రమూ విలువనివ్వలేదు. సమాజంలో నివసిస్తూ శ్రమించి వస్తువులనుత్పత్తి చేయాలన్న ఆదర్శాన్నే బాబా ఆచరించిచూపారు. ఆయన ధాన్యాన్ని పిండిగా విసిరేవారు. సామాన్యులందరూ గృహస్థజీవితాలే కొనసాగించాలని వారి భావం. భగవంతుడిని గురువులో చూచుకొనడమే వారి బోధంతటికీ మూలం. సాయిబాబాకు శిష్యులే లేరు. శిష్యుడన్నవాడు గురువునే సేవిస్తూ వారి అభీష్టాలనే అక్షరాలా నెరవేర్చాలి. ఆయననలా సేవించగలవారు శిరిడీలో ఎవ్వరూ లేరు. వాచా బోధించి, భక్తులను సంస్కరించడం బాబా మార్గంగాదు. ఆయన చెప్పే నీతికథలు, చేసే కొద్ది సూచనలు బోధించడమేననవచ్చు గాని, ఆయనలా ఎంతో అరుదుగా మాత్రమే అలా చేసేవారు. గురువును సంపూర్ణంగా శరణుపొందడమే, ఆత్మార్పణం చేసుకొనడమే సాయిబాబా సాంప్రదాయం. అట్టి భక్తులు ప్రత్యేకించి జపము, ధ్యానము వంటి సాధనలు చేయనవసరంలేదు. సరికదా, జపము, ధ్యానము లేక మేధస్సుతో చేసే సాధనలన్నీ కర్తృత్వాభిమానంతో గూడియుండడంవలన (సాధనకు) అంతరాయాలే అవుతాయి. గురువు చేయదలచిన ఉద్ధరణకు ఆటంకాలవుతాయి. (నిజమైన) గురువు బోధించడు. (ఆత్మ) ప్రభావాన్ని విరజిమ్ముతుంటారు. పూర్తిగా శరణుపొందిన శిష్యుడు దానిని తన యందు యిముడ్చుకుని సంపూర్ణ శ్రేయస్సు పొందుతాడు. స్వంత తెలివితేటలు, స్వయంకృషి, అభిమానములు ఈ ప్రభావానికి అడ్డంకులవుతాయి. 'మెదలకుండా నాచెంత వుండు. మిగలినదంతా నేను చేస్తాను' అన్నదే వారి వాగ్దానం".

# బుద్ధ ధ్యాన హృదయము

(గత సంచిక తరువాయి)

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

## అధ్యాయం - 5

ఈ గ్రంథంలో చెప్పబడిన స్మృత్యుపస్థాన మార్గాన్ని 'ఉనారద' అను సన్యాసి 'బర్మా' లో ఒక మహనీయుని నుండి గ్రహించి లోకానికి వెల్లడి చేశాడు. దానిని 20వ శతాబ్దంలో 'ఉనారదమహాతేర' అను తత్వవేత్త ప్రచారంలోకి తీసుకొచ్చారు. ఇక్కడ చెప్పబడిన సాధనా పద్ధతులను రూపొందించింది వారే.

సామాన్యంగా సాధనాకేంద్రంలో సాధన రెండుమాసాలు కొనసాగించబడుతుంది. అటుతర్వాత సాధకులు స్వస్థానాలలో వారి జీవిత పరిస్థితులకనువైన రీతిన, సాధనకు జీవిత పరిస్థితులకు అనుగుణంగ వారి సాధనను వారే కొనసాగించుకోవలసివుంటుంది.

ధ్యాన కేంద్రంలో తీవ్రమైన సాధన చేసే కాలంలో సాధకులు చదవడం, వ్రాయడం మొదలగు పనులేవీ చేయక ప్రాకృతికమైన నిత్యకృత్యాలు, సాధన, ధ్యానాలలోనే సమయమంతా గడుపుతారు. మాట్లాడడం గూడా అత్యవసరమైనపుడే. సామాన్యసాధకులు ఆ సమయంలో అష్టాంగశలము అను 8 ధర్మాలను పాటిస్తారు. ఉదా॥ మధ్యాహ్నం 12గం॥ల తర్వాత ఘనమైన ఆహారము, పాలు మొదలగు ద్రవాహారాలు తీసుకోరు.

ధ్యాన పద్ధతి గూర్చి యింత విపులంగ వ్రాసినప్పటికీ అనుభవజ్ఞుడైన గురువుయొక్క పర్యవేక్షణకు సాటిరావు. కారణం ఒక్కొక్క సాధకుని యొక్క పరిపాకాన్ని బట్టి తగురీతిన శిక్షణనిస్తాడు గురువు. అట్టి గురువు లభించని వారికి యీ గ్రంథం ఉపకరిస్తుంది.

సాధకుడు ఆరంభంనుండి స్వానుభవముమీద ఆధారపడి సాధన చెయ్యడం యీ మార్గంలో నిత్యావసరం. వస్తువులను, విషయాలను యదార్థంగా తనపై తానే చూడడం నేర్చుకోవాలి. ఇతరుల సూచనలవల్ల, సలహాల వల్ల ప్రభావితం కాకూడదు. సాధనలో తనకు కలుగవలసిన అనుభవాల కోసమై యెదురు చూడగూడదు. అందుకని చేయవలసిన సాధనాపద్ధతుల కన్యంగా తాత్వికమైన సిద్ధాంతాలు వేటిని వివరించ నవసరంలేదు. అభ్యాసం వలన స్మృతి మరింత నిశితమై అంతవరకు తనకవగతం కాని అంశాలను స్మృతికి లక్ష్యాలుగా పెట్టుకున్న వస్తువులకు సంబంధించినవి గుర్తింప నారంభిస్తాడు. ఇందు చెప్పబడిన సూచనలను అనుసరించినటులైతే అతని అనుభవమే అతనికి గురువై ముందుకు తీసుకుపోగలదు. చిత్తశాంతి, స్వయంప్రతిపత్తి, శ్రద్ధాపూర్వకమైన గుర్తింపు - ధ్యాన సాధనయొక్క లక్షణాలు. కనుక స్మృత్యుపస్థానంలో నిజమైన గురువు శిష్యుని పట్ల మితభాషియై వుంటాడు. తన గొప్పతనంతో వారినాకర్షించి శిష్యులనుగా చేసుకోవాలని యత్నించడు.

ఈ సాధన నవలంభించేటప్పుడు యెట్టి అద్భుతమైన అనుభవాలకోసము యెదురు చూడకూడదు. భావోద్రేక పూరితమైన తృప్తిని ఆశించకూడదు. ఆరంభంలో

హృదయపూర్వకమైన ఆశయాన్ని యేర్పరుచుకున్నాక భవిష్యత్తులో తాను సాధించగోరిన అద్భుత స్థితుల గురించి వూహల్లో తేలిపోకూడదు. తొందరగా ఫలితాలను పొందాలని ప్రాకులాడకూడదు. ఇక్కడ చెప్పబడిన అభ్యాసాలనే స్థిరబుద్ధితో శక్తివంచన లేకుండ సంపూర్ణంగా అభ్యసించి యత్నించాలి. ఆరంభంలో వాటి ననుష్టించడమే తనయొక్క ప్రథమ లక్ష్యంగా పెట్టుకోవాలి. వాటిననుష్టించటము ద్వారా తన మనస్సును, ఏకాగ్రతను దృఢతరము చేసుకోవడమే లక్ష్యంగా పెట్టుకోవాలి. ఈ సాధనల యొక్క ప్రాశస్త్యము, విలువ, అదనంగా యీ సాధన యొక్క విలువ, ప్రాశస్త్యము సాధనలో అతనికే అనుభవం కాగలవు.

ఇందు సూచింపబడిన మార్గం 'సూక్ష్మవిపస్యన' లేక 'కేవల లోచూపు' అనే కోవకు చెందినది. అంటే అంతకుముందు యెట్టి ధ్యాన స్థితులను పొందకుండానే తిన్నగా విషయాలను చొచ్చుకుపోయే లోచూపును సంపూర్ణంగా అభ్యసించగలగటమే దీని లక్ష్యం. మొదటి దానిలో స్వానుభవంతో తనలోనే తాను తన శారీరక, మానసిక ప్రక్రియలు గుర్తించ యత్నిస్తాడు. ఈ ప్రక్రియ యొక్క తత్వాన్ని అంతకంతకు నిశితంగా గుర్తించడం, ఏకాగ్రతను బలపరుచుకోవటమే లక్ష్యం. ఇందువల్ల సృష్టియొక్క మూడు ప్రధాన లక్షణాలు అనిత్యత్వము, దుఃఖము, అనాత్మ అనేవి బాగా అవగతమై మార్గఫలములనబడు పవిత్ర స్థితులు కలిగి మోక్షం ప్రాప్తిస్తుంది. ఈ ప్రగతి సప్తవిశుద్ధి అనబడు ఏడు స్థాయిల పారిశుద్ధ్యాల ద్వారా దొరుకుతుంది.

## సాధనారంభం :

**ఆసనము** : ధ్యానానికి పద్మాసనముత్తమమైనప్పటికీ వీరాసనము, సుఖాసనములలో కూర్చుంటే చాలు. కూర్చునేప్పుడు పిరుదుల క్రింద కొంచెం యెత్తుగా మడచిన దుప్పటి పెట్టుకుంటే వెన్ను బిగించనక్కరలేకుండానే శరీరం నిటారుగా ఉంటుంది. తలను కొద్దిగా ముందుకు వంచాలి. తల అలా వుంచినపుడు దృష్టి సహజంగా యెక్కడపడుతుందో అక్కడ నిలపాలి. అయితే కళ్ళను బిగించకుండా సహజంగా నిలపాలి. దృష్టి పడేచోట ఘన చదరాకారం గలదానిని, మెరవనిదానిని ఉంచినటులైతే మనస్సునేవీ ప్రక్కదారి పట్టించకుండా దృష్టిని దానిపై నిలుపవచ్చు. అయితే యీ అంశం అత్యవసరంకాదు. నడుముచుట్టూ గుడ్డను వదులు చేసుకోవాలి. ధ్యానానికుపక్రమించే ముందు మెడ, భుజాలు, ముఖం, చేతులలో కండలు బిగించకుండా చూచుకోవాలి.

**ఆహారము** : మధ్యాహ్నానంతరం ఘనము, పుష్టికరమైన ద్రవాహారాలు తీసుకొనకుండాను, మితాహారిగా ఉండాలి.

**మనోవైఖరి** : ఈ ధ్యానం యొక్క లక్ష్యం మహోన్నతమైనది. సాధకుడి మనోవైఖరి దానికి తగినదిగా ఉండాలి. కనుక సాధకుడు 'బుద్ధం శరణం గచ్ఛామి' మొదలుగా గల మూడు వాక్యాలను భావయుక్తంగా ఉచ్చరించాలి. సాటిలేని గురువైన బుద్ధునియందు, అతడు బోధించిన ధర్మంయందు, దానిననుసరించి ముక్తులైన మహాత్ముల యందు విశ్వాసాన్ని కల్గిస్తాయి యీ వాక్యాలు. సాధన సిద్ధించటానికి యీ విశ్వాసం అవసరం. 'తనను తానే ఉద్ధరించుకోగలిగే సామర్థ్యం తనలోనే ఉన్నది' అనే యెఱుక సంతోషాన్ని, ఆత్మ విశ్వాసాన్ని యిచ్చి సాధనకు బలాన్నిస్తుంది. ప్రశాంతము, నిశ్చయాత్మకము అయిన ఆశయంతో యీ జన్మలోనే జ్ఞానాన్ని పొందాలన్న నిశ్చయంతో సాధనకుపక్రమించాలి. "అనేక మంది బుద్ధులు, వారి గొప్ప శిష్యులు నడచిన బాటను నేననుసరించబోతున్నాను. సోమరులు యీ మార్గాన్ని అనుసరించలేరు. నా శక్తికి జయమగుగాక, నాకు జయమగుగాక" అన్న తలంపుతో ఆరంభించాలి.

**- సశేషం**

(గత సంచిక తరువాయి)

# భగవాన్ శ్రీ భరద్వాజ

***శ్రీమతి శ్రీదేవి***

## అధ్యాయం - 5

## *సాధన - పరిశోధన*

ఆ తర్వాత కొన్నాళ్ళకు శ్రీ వేదవ్యాస రాజమండ్రి నుండి హైదరాబాదు వచ్చారు. భరద్వాజగారు హైదరాబాదులో వారింట్లోని మేడపైని గదిలో వుంటుండేవారు. ఆ రోజుల్లో ఆయన వివేకవర్ధనీ నైట్ కాలేజీలో లెక్చరర్ గా పనిచేశారు.

నిరంతరం కొనసాగుతున్న సాధనాక్రమంలో ఆ రోజుల్లో ఆయన చిత్రవిచిత్రమైన మానసిక అనుభూతులకు లోనవుతుండేవారు.

ఒకసారి భరద్వాజగారు ఊరిబయట నడుస్తూ ఒక మైదాన ప్రదేశంలోని పచ్చిక బయలులో కూర్చున్నారు. ఆయన కూర్చున్న ప్రదేశానికి సమీపంలోని దేవాలయానికి కొందరు భక్తులు వచ్చి దేముని ప్రార్థిస్తూ పూజలు చేస్తూ, గంటలు కొడుతూ కన్పించారు. పచ్చగడ్డిలో కూర్చుని వున్న భరద్వాజగారి ఎదురుగా గడ్డిలో ఒక పొడవైన గడ్డిపోచ గాలిలో అటూ యిటూ వూగుతూ వున్నది. ఆయన దానివైపే తదేకంగా చూస్తూ వుంటే ఆయన మనసులో వింత ఆలోచనలు మెరిశాయి. ప్రజలంతా దేవాలయాలకు వెళ్ళి తమ కష్టసుఖాలను దేమునికి మొరపెట్టుకుంటున్నారు. దేముడనేవాడే వుంటే ఆయన ద్వారా వారు తమ కష్టాలను నివారించుకొంటారు. 'అయితే మనవలె భూమిపై జన్మించి కాలక్రమేణా పెరిగి పెద్దదౌతున్న ప్రాణమున్న యీ గడ్డిపోచ మానసిక స్థితి ఎలా వుంటుంది? దీనికి కూడా కష్టం, సుఖం, సంతోషం, దుఃఖం వంటి అనుభూతులుంటాయా?' అని ఆలోచిస్తున్న భరద్వాజగారు ఆ గడ్డిపోచ చైతన్యంతో తాదాత్మ్యం చెందారు. శాఖలు శాఖలుగా పచ్చదనంతో ఆ పరిసరమంతా వ్యాప్తిచెందిన ఆ గడ్డిపోచ చైతన్యంతో మమేకమై దేహస్ఫురణలేని స్థితిలో ఆయన ఎంతోసేపు వుండిపోయారు.

అటు తర్వాత ఆయనకు సృష్టిలోని జడ, చేతన పదార్థాలన్నింటితోను తాదాత్మ్య భావన సిద్ధించింది. తమ ఎదుటనున్న వారి బాధలు, సంతోషాలు తమకు అనుభూత మవసాగాయి. ఎదుటి వ్యక్తి ఏదైనా శరీర బాధననుభవిస్తున్న సమయంలో ఆ వ్యక్తి శరీరంలో ఏ భాగంలోనైతే నొప్పితో బాధపడుతున్నాడో, సరిగ్గా తమ శరీరంలోని అదే భాగంలో భరద్వాజగారికి అదే విధమైన నొప్పి, బాధ అనుభవమయ్యేవి.

ఆయనకు తమ మనసులో ఎవరినైనా చూడాలనిపించగానే కొద్ది నిముషాలలోనే ఆ వ్యక్తులు ఆయన వద్దకు రావటం జరిగేది.

ఒకసారి భరద్వాజగారు హైద్రాబాద్ లోని జనసమ్మర్ధంగా వున్న ఒక వీధిలో నడుస్తున్నారు. అప్పుడాయన తమ మనసులో 'యోగులు సంకల్ప మాత్రాన మనోవేగంతో ఏ ప్రదేశానికి వెళ్ళాలని అనుకుంటే ఆ ప్రదేశానికి తక్షణమే వెళ్ళగలుగుతుంటారు. అది ఏ విధంగా సాధ్యం?' అని అనుకుంటుండగానే తక్షణమే తాము అప్పుడు నడుస్తున్న ప్రదేశానికి ఎంతో దూరాన వున్న టాంక్ బండ్ పై వున్నారు.

అంటే, భరద్వాజగారిలో నిరంతరం సాగుతున్న సాధనాక్రమంలో అప్రయత్నంగానే యోగసిద్ధి ప్రాప్తించి, భావనామాత్రం చేతనే ఆయనకు కామగమనం కరతలామలకమైంది.

**- సశేషం**

(ఫిబ్రవరి సంచిక తరువాయి)

# శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు

**శ్రీమతి శ్రీదేవి**

ఒకసారి ఢాకాలోని వీరేంద్ర దాదాకు "నామసంకీర్తన వలన నిజంగా ప్రయోజనం వుంటుందా, మనంచేసే సంకీర్తనలవలన దైవం నిజంగా సంతృప్తి చెందుతాడా?..." యిలాంటి సందేహాలు తలెత్తాయి. ఆనాటి సాయంత్రం రమణాశ్రమంలో భక్తులందరూ భజన చేస్తున్నారు. వీరేంద్ర దాదా కూడా వారందరి మధ్యలో కూర్చుని కనులు మూసుకుని నెమ్మదిగా భజన చేస్తున్నాడు. ఉన్నట్లుండి అతని కనుల యెదుట ఒక దివ్యజ్యోతి ప్రకాశిస్తూ దర్శనమిచ్చింది. అతడు ఆశ్చర్యంతో చూస్తుండగానే ఆ జ్యోతి మధ్యలో శ్రీకృష్ణుని రూపం దర్శనమిచ్చింది. మితిమీరిన పారవశ్యంతో అతని ఒళ్ళంతా చెమటలు పట్టాయి. చాలాసేపటికి గానీ అతడు మామూలు స్థితికి రాలేకపోయాడు. అదే రోజు సాయంత్రం భక్తుల మధ్యలో కూర్చుని ఆనందమయి అమ్మ వారితో సంభాషిస్తున్నారు. అప్పుడు హరనాథ్ అనే వ్యక్తి అమ్మను యిలా ప్రశ్నించాడు, "అమ్మా! హరినామాన్ని రోజుకు ఒక్కసారి 'హరిబోల్' అని అనుకుంటే చాలదా? అన్నిసార్లు పదే పదే 'హరిబోల్, హరిబోల్' అనటం వలన ప్రయోజనం యేమిటి? అప్పుడు అమ్మ "వరుసగా భగవన్నామాన్ని ఉచ్చరిస్తూ వుంటే ఆ నామం నుండి ప్రణవం జనిస్తుంది" అన్నారు. మరల వీరేంద్ర దాదాను చూస్తూ "నువ్వు యీ రోజు యేదైతే చూశావో అది కేవలం ప్రణవం యొక్క ఛాయ మాత్రమే" అని అన్నారు. అంతటితో అతని సందేహం తీరిపోయింది.

కొద్దిరోజుల తర్వాత అమ్మ కాశీధామము నుండి తారాపీఠ్‌కు బయలుదేరారు. శ్రీ ఆనందమయి అమ్మతో గురుప్రియ, శ్రీ అఖండానందగిరి స్వామి, అతుల్, నేపాల్ దాదా, శంకరానంద కూడా వెళ్ళారు. అమ్మ తారాపీఠ్ వచ్చారని తెలుసుకుని యెందరో భక్తులు అక్కడికి చేరుకున్నారు. ఎంతో నిశ్శబ్దంగా, నిర్మానుష్యంగా వుండే ఆ ప్రాంతం జనసందోహంతో నిండిపోయింది. తారామాత, శంకరుల మందిరాలు నిర్మింపబడిన ఆ ప్రదేశం నిజానికి గ్రామానికి దూరంగా వున్న స్మశాన ప్రదేశం. గ్రామంలో కూడా కేవలం కొద్దిమంది పండాల యిండ్లు తప్ప యింకేమీ వుండవు. అటువంటి ఆ ప్రాంతమంతా శ్రీ ఆనందమయి మాత తరచు అక్కడికి వస్తూ వుండటంతో యెంతో కోలాహలంగా, సందడిగా మారిపోయింది. కాలక్రమేణా అక్కడికి తాము వచ్చినపుడు యిబ్బంది లేకుండా వుండేందుకు కొందరు భక్తులు గృహాలు కూడా నిర్మించుకొనటం ప్రారంభించారు. ఎన్నో దుకాణాలు వెలిసాయి. అనేక మంది భక్తులు తారామాతకు, ఈశ్వరునికి యెంతో ఆడంబరంగా, వైభవంగా అఖండ పూజలు, భక్తులకు అన్న సంతర్పణలు జరుపనారంభించారు.

తారాపీఠంలో ఒక రోజు శ్రీ ఆనందమయి మాత గురుప్రియాదేవిని, జ్యోతిష్ దాదాను తన వద్దకు పిలిపించుకున్నారు. వాళ్ళిద్దరినీ తన యెదురుగా కూర్చుండబెట్టుకుని "మీరిద్దరూ జాగ్రత్తగా వినండి. ఈ రోజు నుండీ మీరిద్దరూ అన్నా చెల్లెళ్ళు. ఒక తల్లి గర్భాన పుట్టిన బిడ్డల లాగ మీరు వుండాలి. మీరు ఒకరి బాధ్యతలు మరొకరు పంచుకుంటూ ఒకరి బాగోగులు ఒకరు కనిపెట్టి కలసిమెలసి జీవించాలి" అన్నారు. "అమ్మా! తప్పకుండా మీరు చెప్పినట్లే నడుచుకొంటాం" అంటూ జ్యోతిష్ దాదా, గురుప్రియ అమ్మ పాదాలకు నమస్కరించారు. శ్రీ ఆనందమయి అమ్మ జ్యోతిష్ దాదా చేతిని గురుప్రియా దేవి

చేతిలో పెట్టి వారిని ఆశీర్వదించారు. కొన్ని రోజులుగా జ్యోతిష్ దాదా అనారోగ్యంగా వున్నారు. గురుప్రియ అమ్మతో "అమ్మా! ఇప్పుడు మా కర్తవ్యం యేమిటి? మేము యిరువురమూ కలసి చేయవలసిన విషయాలు యేమయినా వున్నాయా?" అన్నది. జ్యోతిష్ దాదా "అమ్మా! నేను నా చెల్లెలు గురుప్రియతో కలసి మీ ఆదేశాలను తు.చ. తప్పక పాటిస్తాను. ఇప్పుడు నన్ను యేమి చేయమంటారో చెప్పండి" అన్నాడు. అమ్మ గంభీరంగా "గురుప్రియా! నువ్వు యిప్పుడు నా జ్యోతిష్ దాదాతో కలసి 'చటగామ్' కు వెళ్ళాలి. జ్యోతిష్ నీకు ధార్మిక సోదరుడు. ధార్మిక సోదరునికి సేవ చేసేందుకు నీవు వెళ్ళాలి. నీ బాధ్యత కేవలం నీ తండ్రి అఖండానందగిరి స్వామి పట్ల మాత్రమే కాదు. నీ ధార్మిక సోదరుని సేవ అనేది నీపై వున్న మరొక బాధ్యత. దానిని కూడా నీవు నెరవేర్చాలి. కేవలం రక్తసంబంధ బాంధవ్యాలకు మాత్రమే విలువ యిస్తే ఆ పరిస్థితి వేరుగా వుంటుంది. అది సాధారణ జీవితాలను గడిపే మానవ ప్రవృత్తి మాత్రమే. కాని, యీ మార్గంలో ప్రయాణించేవారు లౌకిక అనుబంధాలు మాత్రమేకాక ధార్మిక సంబంధాలు, అనుబంధాలకే యెక్కువ ప్రాధాన్యత యివ్వవలసి వుంటుంది. ఈ అనుబంధాలే ముఖ్యమైనవిగా పరిగణించాలి" అన్నారు.

ఆనాటి మధ్యాహ్నం అమ్మ గురుప్రియను తన గదిలోకి పిలిపించుకుని యేకాంతంలో ఆమెతో అనునయంగా "చూడు, నీకు నా సంగతి తెలియదా? అంతా నీ మేలు కోసమే కదా నేను చేసేది. చటగామ్‌లో మీరిరువురూ కలసి కొన్నాళ్ళు వుండాలనీ, జ్యోతిష్ సేవ చేయాలని నేను చెప్పిన యీ విషయంలో నీకు యెటువంటి యిబ్బందీ లేదని అనుకొంటున్నాను" అన్నారు. "అమ్మా! జ్యోతిష్ అన్నకు దగ్గరుండి సేవ చేయటంలో నాకు యేమి యిబ్బంది వుంటుందమ్మా? కానీ మీ సన్నిధిలో జీవించే భాగ్యాన్ని కోల్పోతున్నాను. నన్ను మీరు దూరం పెడ్తున్నారెందుకో తెలియదు. ప్రతిక్షణం మీ చెంతనే వుండి యెంతో సంతోషంగా గడిపిన ఆ పాత రోజుల జ్ఞాపకాలు నన్ను బాధిస్తుంటాయి. మళ్ళీ ఆ రోజులు వస్తాయా అన్న సందేహం నన్ను వేధిస్తుంటుంది. అంతేనమ్మా. అదొక్కటే నా బాధ" అన్నది గురుప్రియ. "నీ బాధ నాకు తెలుసు. అయితే ఒక విషయం తెలుసుకుంటే నీకు యీ బాధ వుండదు. నీ పట్ల నా ప్రతిచర్యా నీకు శుభం కలిగించేదిగా వుంటుందన్న విషయాన్ని నీవు విశ్వసించాలి. అంతా, నీ మంచి కోసమే జరుగుతున్నదన్న సంగతి అర్థం చేసుకో. ఇంక యేమీ ఆలోచించవద్దు" అంటూ అమ్మ గురుప్రియను ఓదార్చారు.

ఆనాటి సాయంత్రం లోపల అమ్మ స్వయంగా వీరిద్దరి చటగామ్ ప్రయాణానికి యేర్పాట్లు గావించారు. యతీష్‌నాథ్ పండాను పిలిపించి వెంటనే కారు సిద్ధం చేయించారు. ఆ సాయంత్రం వీరిద్దరినీ పిలచి భోజనం చేయమని చెప్పారు. తర్వాత తారామాత మందిరంలో జరుగుతున్న సంకీర్తన వద్దకు వెంట బెట్టుకుని వెళ్ళారు. కొద్దిసేపు సంకీర్తనలో పాల్గొన్న తర్వాత, వెంటనే చటగామ్ బయల్దేరమని చెప్పారు.

**- సశేషం**

---

# మాతృదేవి స్మృతులు

12వ పేజీ తరువాయి

వుంటుంది. వారు పాడగా వినే భాగ్యం నాకు కలిగింది. ప్రతిరోజూ రాత్రి గురుపుత్రులు శ్రీ ద్వారకబాబుగారు, గురుపుత్రిక శ్రీమతి వేదమ్మగారు బాబాకు హారతి చేసేవారు. అప్పుడు కొన్నిసార్లు పూజ్యశ్రీ అమ్మగారు కూడా 'శిష్యప్రియ' పాడగా నేను విన్నాను. ఆ స్వరం చాలా బాగుంటుంది.

పూజ్యశ్రీ మాస్టరుగారు సన్యాసియై లోకానికి తెలియకుండా వుండిపోతే మనల్ని ఉద్ధరించేవారు లేరని తలచి జగన్మాతయే అలివేలుమంగతాయిగా అవతరించి వారిని గృహస్థులను చేశారు. ఆ ఆదిదంపతుల నీడన మనందరం ఇలా హాయిగా మనగలుగుతున్నామని నాకు అనిపిస్తుంది.

"నా సమస్త అపరాధాలను మన్నించి, నాకున్న అన్ని జన్మలలోనూ నన్ను మీ పాదాల చెంత చేర్చుకొని ఉద్ధరించండి! అమ్మా! అలివేలు మంగతాయి! జగజ్జనని! ఉద్ధరించు తల్లీ!!"అని ప్రార్థిస్తూ వినమ్రపూర్వక వందనాలు అర్పిస్తున్నాను.

# ద్వారకామాయి అనుభవమండపము

*శ్రీమతి అనుపిండి నాగ శ్రావణి, హైదరాబాదు*

నా పెళ్లి కాకముందు అనకాపల్లిలో వుండేవాళ్ళము. తరచూ మా ఇంటిదగ్గరున్న బాబా గుడికి వెడుతూ, పారాయణ చేసుకుంటూ, సేవ చేసుకునేదాన్ని. ఒకరోజు ఒక చిన్న అబ్బాయి మా నాన్నగారికి సాయిబాబాది ఒక చిన్న చిత్రపటం యిచ్చాడట. ఆ అబ్బాయితో మా నాన్నగారికి పరిచయం లేదు. తరవాత దాన్ని ఫ్రేము కట్టించడానికి యిచ్చాము. షాపు అతను ఏం చేశాడంటే, ఆ చిన్న చిత్రపటాన్ని చాలా పెద్దగా చేసి పెద్ద పటం కట్టాడు. మేము చాలా ఆశ్చర్యపోయాం. అంత పెద్దది చేయమని మేమైతే చెప్పలేదు. సరే చేసి యిచ్చాడు కదా అని పటాన్ని ఇంట్లో పెట్టుకున్నాము. ఇక అప్పటినుంచి మా జీవితం మొత్తం మారిపోయింది. చాలా చక్కటి అనుభవాలు, శుభసంఘటనలు యెన్నో జరిగాయి.

మొట్టమొదటి అనుభవం ఏమిటంటే, మా ఇంటి కింద భాగంలో వుంటున్న ఆంటీకి స్వప్నంలో బాబాగారు దర్శనమిచ్చి, మా ఇంట్లో వున్న వారి పెద్ద పటం ఆమెకి చూపించి, “ఈ ఫోటో వున్న వారింటి అమ్మాయికి నేను పెళ్లి చేద్దాం అనుకుంటున్నాను. ఆ అమ్మాయిని విష్ణు సహస్రనామం పారాయణ చేయమని చెప్పు” అని అన్నారట! ఆ స్వప్నం ఆవిడకి గురుపూర్ణిమనాడు వచ్చింది. ఆవిడకి ఆ బాబా పటం ఎవరింట్లో వున్నదో తెలియదు. మాకు ఆవిడతో అంతంత మాత్రమే



పరిచయం. తర్వాత శ్రావణ మాసంలో పేరంటానికి అందరితో పాటు ఆవిడని కూడా పిలిచాము. అప్పుడు ఆవిడ మా ఇంటికి వచ్చి, మా ఇంట్లో వున్న పెద్ద బాబాపటాన్ని చూసి, తనకి బాబా స్వప్నంలో చూపించింది ఆ పటమే అని నిర్ధారించుకుని, స్వప్న వృత్తాంతమంతా మాతో చెప్పారు.

మేము దాన్ని అంత నమ్మకంగా తీసుకోలేదు. మళ్ళీ యింకొకసారి బాబాగారు ఆమెకి స్వప్నంలో కనిపించి, మళ్ళీ యిదే మాట చెప్పారట. వెంటనే ఆవిడ మా దగ్గరకు వచ్చి “ఏవండీ మీరు విష్ణు సహస్రనామ పారాయణ చేయలేదా? మీరు చేయకపోతే చెప్పండి నేను వచ్చి మీ ఇంట్లో పారాయణ చేస్తాను. బాబా మళ్ళీ స్వప్నంలో దర్శనమిచ్చి మిమ్మల్ని విష్ణు సహస్రనామ

పారాయణ చెయ్యమని చెప్పారు” అని మాతో చెప్పారు. ఇది అక్టోబరు నెలలో జరిగింది. అప్పుడు అమ్మవారి నవరాత్రులు జరుగుతున్నాయి. మాకు ఇంట్లో నిత్య పూజలు తప్పించి పెద్దగా ఏ గురువులు కాని, ఏ దేవతోపాసన కాని తెలియదు. ఆవిడ అలా చెప్పాక, ఒకరోజు మా ఇంట్లో అందరినీ పిలిచి విష్ణు సహస్రనామ పారాయణ చేసుకున్నాం.

నవంబరు మొదటి వారంలో నేను రాజమండ్రిలో వుంటున్న మా పిన్నివాళ్ళ ఇంటికి వెళ్ళాను. అప్పుడు అనుకోకుండా ఒక సంబంధం రావడం, నవంబరు 28 తేదీన పెళ్లి చూపులు, 29న నిశ్చయ తాంబూలాలు పుచ్చుకోవడం కూడా అయిపోయాయి.


ఇది బాబాగారు నిర్ణయించిన కళ్యాణం అని ఘంటాపథంగా అందరికీ అర్థం అయ్యింది. బాబా మాకు శ్రేయస్కరమైనదే చేస్తారని నమ్మకంతో నాతో సహా మా ఇంట్లో వాళ్ళు కూడా మావారి సంపాదన, మిగిలిన పరిస్థితులు ఏమీ పట్టించుకోలేదు. అలాగే వాళ్ళూ మమ్మల్ని కట్నం ఏమీ అడగలేదు. అంతా ‘బాబా దయ’ అనుకుని ముందుకెళ్ళాము.

ఇలా హఠాత్తుగా నిర్ణయించిన కారణంగా డబ్బు ఎలా సర్దుబాటు చెయ్యాలా అని నాన్నగారు కంగారుపడుతుంటే, మా అమ్మకి శ్రీ సాయినాథులవారు స్వప్నదర్శనమిచ్చి, “ఈ కళ్యాణం నేను చేస్తాను, కంగారు పడొద్దు” అని చెప్పారు. నాన్నగారు ఆఫీసులో రుణం(Loan) తీసుకుని, ఎంతో ప్రశాంతంగా నా వివాహం జరిపించారు. ఈ అనుభవం తలచుకున్నప్పుడల్లా చాలా ఆశ్చర్యానందాలు కలుగుతాయి. మేము ఆయనకి ఎటువంటి ప్రత్యేక పూజ, ప్రార్థన లాంటివి ఏమీ చేసిన వాళ్ళము కాదు. మరి బాబావారికి మామీద ఎందుకంత కరుణయో!!

2014 ఫిబ్రవరిలో పెళ్లి అయింది. మరుసటి నెల మార్చిలో, గర్భవతిని అయ్యాను. ఏడో నెలలో పురిటికి అమ్మావాళ్ళ ఇంటికి వచ్చినప్పుడు, మళ్లీ మా ఇంటి కింద భాగంలో వున్న ఆంటీకి బాబాగారు కలలో కనిపించి, “ప్రసవ సమయంలో కొద్దిగా ఇబ్బందులు వస్తాయి, నాగుపాము పడగతో వున్న నా చిత్రపటం పెట్టుకోమను. ఆ ఇబ్బంది గట్టెక్కిస్తాను” అని చెప్పారట. మా నాన్నగారు అలాగే నాగసాయి చిత్రపటం తీసుకువచ్చారు. అది ఇంట్లో పెట్టుకుని రోజూ నమస్కారం చేసుకునేదాన్ని. డిసెంబరు 3వ తేదీకి నాకు ప్రసవం అవుతుందని వైద్యులు చెప్పారు. అయితే అప్పుడు నాకు సంభవించిన ఆరోగ్య సమస్యల కారణంగా, తల్లినో, పిల్లనో, ఎవరినో ఒకరినే యివ్వగలం అని వైద్యులు చెప్పారు. మేమంతా చాలా భయపడిపోయి, బాబాగారిని ఈ ఆపద గట్టెక్కించమని వేడుకుంటున్నాము. ఎంత ఆశ్చర్యం అంటే, నవంబరు 7వ తేదీకే సాధారణ ప్రసవమై పాప పుట్టింది. ఇద్దరికి ఎటువంటి అనారోగ్యము లేదు. ఇప్పుడు మా పాపకి పది సంవత్సరాలు. ఒక దాని తర్వాత ఒకటి ఇలా నా జీవితంలో జరిగే ప్రతిదీ ఆయన నాకు ముందుగానే ఎవరో ఒకరి ద్వారా సూచిస్తూ నన్ను కాపాడుతూనే వున్నారు. తర్వాత కూడా ఎన్నో యిబ్బందులు వచ్చాయి, కానీ అన్నిసార్లూ ‘నేను వున్నాను’ అని భరోసా యిచ్చి నన్ను కాపాడుతున్నారు.

వారు ఏది ఎందుకు చేస్తారో, ఆ సంఘటన జరిగిన చాలా కాలానికి కానీ మనకు అర్థం కాదు. పెళ్ళైన వెంటనే గర్భం వచ్చిందని కొంత ఆందోళన పడ్డాము, కానీ పాప పుట్టిన కొన్నాళ్ళకే, గర్భసంచి తొలగించవలసి వచ్చింది. ఇప్పుడు ఆలోచిస్తే అనిపిస్తుంది, అప్పుడు అలా జరిగి ఉండకపోతే నాకు అసలు పిల్లలు పుట్టే వాళ్ళే కాదని!!

నాపై కురిపించిన అపార కరుణాకటాక్షాలకి సమర్థ సద్గురు సాయినాథునికి శిరస్సువంచి పాదాభివందనములు సమర్పించుకుంటున్నాను. ●



# ఆచార్యుని అద్భుత లీలలు

**శ్రీ పర్వతరావు, ఒంగోలు**

పూజ్యశ్రీ భరద్వాజ గురుదేవుల లీలావైభవాన్ని, పూజ్య గురుదేవులతో వారికి గల అనుభవాలను, అనుభూతులను ఒంగోలు వాస్తవ్యులు శ్రీ పర్వతరావుగారు ఈవిధంగా తెలియచేస్తున్నారు.

1985లో నేను వర్క్స్-ఇన్స్పెక్టరు(works inspector)గా పనిచేస్తున్నపుడు మా ఇంజనీరుగారి ఇంటికి 'సాయిబాబా' పక్షపత్రిక వస్తుండేది. దానిలో ద్వారకామాయి అనుభవ మండపము ఎప్పుడూ చదువుతుండేవాడిని. ఆ పత్రికలో శ్రీ సాయిలీలామృతము పారాయణ చేసినందువలన ఒకరికి బాబు జన్మించాడని, ఇంకొకరికి ఉద్యోగం వచ్చిందనీ వ్రాసివున్న అనుభవాలు నన్ను ఆకట్టుకున్నాయి.

నాకు మొదటి సంతానం అమ్మాయి, జాతకరీత్యా తర్వాత కూడా అమ్మాయే పుడుతుందని చెప్పారు. నేను 'శ్రీ సాయిలీలామృతము' గ్రంథము తీసుకొని మాకు బాబు పుట్టాలన్న కోరికతో పారాయణ మొదలుపెట్టాను. ఒక పారాయణ తర్వాత పూజ్యశ్రీ మాస్టరుగారిని కలవాలని ప్రెస్ దగ్గర అడ్రస్ తీసుకున్నాను. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు సంతపేటలో జె.వి. సుబ్బయ్యగారి ఇంటి పక్కన వుండేవారు. పూజ్యశ్రీ మాస్టరుగారిని కలుసుకుని నా కోరికను విన్నవించుకున్నాను. పూజ్యశ్రీ మాస్టరుగారు శ్రీ సాయిలీలామృతం గ్రంథం మీద తమ ఆశీస్సులు వ్రాసిచ్చి మా దంపతులనిద్దరినీ పారాయణ చేయమన్నారు. ముఖ్యంగా నా శ్రీమతిని ఏడుసార్లు పారాయణ చేయమన్నారు. అప్పటికి నా శ్రీమతికి ఐదో నెల. "తప్పక బాబా జాతకం మారుస్తారు, బాబాకు ఆ శక్తి వుంది!" అని పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పారు. తర్వాత 'శ్రీ గురుచరిత్ర' గ్రంథం మీద కూడా పూజ్యశ్రీ మాస్టరుగారు ఆశీస్సులు వ్రాసి ఇచ్చి ఏడుసార్లు పారాయణ చేయించారు.

నాకు శిరిడీ వెళ్లాలని కోరికగా వుందని పూజ్యశ్రీ మాస్టరుగారితో చెప్పాను. 1986, జనవరి ఐదవతేదీన పూజ్యశ్రీ మాస్టరుగారు శిరిడీ వెళ్తూ నన్ను కూడా రమ్మన్నారు. నా శ్రీమతికి 9 వ మాసం వచ్చింది. డాక్టరు దగ్గర పరీక్ష చేయిస్తే వారం రోజులలో ప్రసవం అవుతుందని, శస్త్రచికిత్స చేయాలనీ చెప్పారు. నా యాత్ర తొమ్మిది రోజులు. నా శ్రీమతి, "ఇప్పుడు మీరు శిరిడీకి వెళ్లవద్దు, మీరు వెళ్ళిన వెంటనే నాకు కాన్పు రావచ్చు!" అని చెప్పింది. నేను "మనిద్దరం పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గరకు వెళ్లి, వారిని అడుగుదాము. ఆయన ఎలా చెప్తే అలా చేద్దాము!" అన్నాను. మేము పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గరకు వెళ్ళాము. పూజ్యశ్రీ మాస్టరుగారు, "అమ్మా! అబ్బాయిని పంపించు. మేము వచ్చేవరకు నీకు ఏమీ కాదు!" అని చెప్పారు.

నేను పూజ్యశ్రీ మాస్టరుగారితో శిరిడీకి

బయలుదేరాను. ఒంగోలు నుంచి శిరిడీకి రెండు బస్సులు బయలుదేరాయి. ఒక బస్సులో పూజ్యశ్రీ మాస్టరుగారు, రెండవ బస్సులో జె.వి.సుబ్బయ్యగారు బయలుదేరారు. నాకు పూజ్యశ్రీ మాస్టరుగారి వున్న బస్సులో వారి వెనుక సీటు వచ్చింది. హంపి, బీజాపూర్, అక్కల్కోట, గాణ్గాపురం, నర్సోబావాడీ  దర్శించుకుని 9వ తేదీన శిరిడీ చేరుకొన్నాము.

దారిలో  ప్రతి క్షేత్రంలోనూ పూజ్యశ్రీ మాస్టరుగారు సత్సంగము చేసేవారు. సంగమంలో పూజ్యశ్రీ మాస్టరుగారికి అందరమూ కలిసి స్నానం చేయించాము. ఆ యాత్రలో వారి వస్త్రాలు ఉతికే సేవ నాకు లభించింది. అవి నా జీవితంలో మరువలేని అద్భుత అదృష్ట ఘడియలు! గాణ్గాపురం క్షేత్రంలో నేను రెండు దత్త విగ్రహాలు కొన్నాను. ఒకటి పూజ్యశ్రీ మాస్టరుగారికిచ్చి ఇంకొకటి నేను తీసుకున్నాను. తర్వాత పూజ్యశ్రీ మాస్టరుగారు నాతో, "నేను ఈ విగ్రహాన్ని  ఎవరికైనా ఇస్తే నీకు అభ్యంతరం లేదు కదా?" అన్నారు. నేను నాకు అభ్యంతరం లేదని చెప్పాక ఆయన ఆ విగ్రహాన్ని ఒక గురుబంధువుకి ప్రసాదించారు.

శిరిడీలో పూజ్యశ్రీ మాస్టరుగారికి గురుస్థానం పక్కన రూము యిచ్చారు. పూజ్యశ్రీ మాస్టరుగారు నన్ను గురుస్థానం దగ్గర శ్రీ గురుచరిత్ర పారాయణ ఏకాహం చేయమన్నారు. అలానే ఒక పారాయణ పూర్తి చేసి ఆ రాత్రి నేను, మరి కొంతమంది ద్వారకామాయిలో నిద్రించాము. ఆ రాత్రి నాకు గురువారం రోజున బాబు జన్మించినట్లు స్వప్నం వచ్చింది. ఉదయం పూజ్యశ్రీ మాస్టరుగారికి చెప్తే, "అయితే తప్పక బాబు జన్మిస్తాడు. ఇక సందేహమే లేదు!" అన్నారు!

మేము యాత్రనుండి తిరిగి వచ్చిన తర్వాత గురువారం ఉదయం నా శ్రీమతికి నొప్పులు వచ్చాయి. ఆసుపత్రికి తీసుకుని వెళ్తే శస్త్రచికిత్స తప్పదన్నారు. ఈ సంగతి పూజ్యశ్రీ మాస్టరుగారికి చెప్తే ఊదీ, బాబా పటం ఇచ్చి, ఊదీ పొట్టకి రాసి, కొంచెం గ్లాసులో  నీళ్లలో కలిపి త్రాగించమన్నారు. అలా చేయగానే శస్త్రచికిత్స అవసరం లేకుండానే సుఖంగా ప్రసవం జరిగింది! మా బాబుకి పూజ్యశ్రీ మాస్టరుగారే పేరు పెట్టారు. తర్వాత మా పాప లావణ్యకు, బాబు వేంకట శివసాయికి, పూజ్యశ్రీ మాస్టరుగారు ఒంగోలులోని ద్వారకామాయిలో అక్షరాభ్యాసం చేశారు.

మా అబ్బాయికి జాతకరీత్యా పాఠశాల వరకే చదువు వస్తుందని ఒక స్వామీజీ చెప్పారు. కానీ పూజ్యశ్రీ మాస్టరుగారు అక్షరాభ్యాసం చేసిన ప్రభావం వలన, అమ్మాయి కంప్యూటర్ సైన్స్ లో ఇంజనీరింగ్, అబ్బాయి ఎంటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ఇద్దరికీ ఫ్రీ సీట్లు ఒంగోలులోనే వచ్చాయి!

1987లో శ్రీరామనవమికి రెండురోజులముందు పూజ్యశ్రీ మాస్టరుగారు స్వప్నదర్శనమిచ్చి శ్రీ సాయి సచ్చరిత్ర చేతిలోకి తీసుకొని, బాబాను స్మరించి ఒక అధ్యాయం తీసి, 'ఆ అధ్యాయం ఒక పుస్తకంలో వ్రాసుకొని వారం రోజులు లోపు 108 సార్లు పారాయణ చేస్తే బాబా దర్శనమవుతుంది' అని చెప్పారు. నేను మర్నాడు ఆ విషయం పూజ్యశ్రీ మాస్టరుగారిని దర్శించి విన్నవిస్తే అలాగే పారాయణ చేయమన్నారు. నేను, "మాస్టరుగారూ! నాకు స్వప్నంలో ఆదేశించింది మీరే కదా! మీరే ఒక అధ్యాయం తీయండి!" అన్నాను. పూజ్యశ్రీ మాస్టరుగారు ఆ గ్రంథాన్ని చేతిలోకి తీసుకొని ఆశీస్సులు వ్రాసి, బాబాను స్మరించి ఒక అధ్యాయం తీశారు. 45వ అధ్యాయం వచ్చింది.  ఆ అధ్యాయం వారం రోజుల్లో 108 సార్లు పారాయణ చేశాను. కొన్నిరోజులకు  నాకు ఒక స్వప్నం వచ్చింది. అందులో... నేను శిరిడీకి వెళితే బాబా సమాధి, విగ్రహం కనిపించలేదు! అక్కడ పూజారిని అడిగాను. 'అదిగో క్రింద వుంది చూడ'మన్నారు. అక్కడ క్రిందకి మెట్లు వున్నాయి! దిగి చూస్తే అందులో బాబా సమాధి, నైవేద్యాలు కనిపించాయి! అప్పుడు బాబా సమాధిలోనించి పైకి వచ్చి ఆశీర్వదించారు! స్వప్నం ముగిసింది. వెంటనే పూజ్యశ్రీ మాస్టరుగారికి చెప్తే, "చాలా మంచి దర్శనం!" అన్నారు.

1989, ఏప్రిల్ 9వ తేదీన గురుబంధువైన బ్రహ్మయ్యగారు నడిపే శ్రీ సాయి పబ్లిక్ స్కూల్ (భాగ్యనగర్) వార్షికోత్సవానికి పూజ్యశ్రీ మాస్టరుగారిని కారులో

తీసుకుని వచ్చే భాగ్యం కలిగింది. నాకు ఎప్పటినుంచో పూజ్యశ్రీ మాస్టరుగారితో ఫోటో తీయించుకోవాలని, వారికి వస్త్రాలు సమర్పించుకోవాలని కోరికగా వుండేది. ఆరోజు సత్సంగంలో పూజ్యశ్రీ మాస్టరుగారికి ఆకుపచ్చ షాలు ఒకటి సమర్పించుకున్నాను. తర్వాత అక్కడి ఫోటోగ్రాఫర్, నేను పూజ్యశ్రీ మాస్టరుగారి పాదాల చెంత కూర్చునివుండగా ఫోటో తీశాడు! అలా నా రెండు కోరికలు నెరవేరాయి!

పూజ్యశ్రీ మాస్టరుగారిని కారులో తిరిగి ఇంటికి తీసుకుని వెళ్ళేటప్పుడు, వల్లూరు సాయిబాబా మందిరం ప్రణాళిక గురించి చెప్పాను. "వీలైతే రేపే మీరు వెళ్లి ఆ ప్రణాళిక తీసుకునిరండి, తర్వాత నేను వుండను!" అని మరీ మరీ చెప్పారు. నేను పూజ్యశ్రీ మాస్టరుగారు ఎక్కడికైనా సత్సంగాలకు వెళతారు కాబోలు అనుకొని అశ్రద్ధ చేశాను. ఏప్రిల్ 12వ తేదీన ఉదయం పూజ్యశ్రీ మాస్టరుగారు సమాధి చెందారన్న వార్త తెలిసింది! నేను చాలా కృంగిపోయాను. బాబా లాగానే పూజ్యశ్రీ మాస్టరుగారు కూడా మూడు రోజుల తర్వాత లేస్తారన్న విశ్వాసంతో వున్నాను. కానీ మరునాడు పూజ్యశ్రీ మాస్టరుగారిని బాబా మందిరంలో సమాధి చేశారు.

నెలరోజుల తర్వాత పూజ్యశ్రీ మాస్టరుగారు స్వప్నదర్శనమిచ్చారు. వేలాది మంది భక్తులు శ్రీ సాయి సంకీర్తన చేస్తున్నారు. అచట పూజ్యశ్రీ మాస్టరుగారు కూర్చొని వున్నారు. నేను వెళ్లి పూజ్యశ్రీ మాస్టరుగారికి దూరం నుంచి నమస్కారం చేసుకున్నాను. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు, "నాకు ఎప్పుడూ ఇలాగే నమస్కారం చేసుకుంటావా?" అని పాదాలు ముందుకు చాపారు. నేను పాద నమస్కారం చేసుకోగానే వారి చేతినిండా విభూతి వచ్చింది. అది నా నుదుటన పెట్టి, నాకు సంబంధించిన సాధనారహస్యం ఒకటి చెప్పారు. ఇప్పటికీ సమాధినుంచి మమ్మల్ని కాపాడుతూ నిత్యం నేను మీతోనే వున్నానని ఎన్నో అనుభవాలు ప్రసాదిస్తున్నారు. 'నా సమాధి నుండి నేను సర్వ కార్యములు నిర్వర్తిస్తాను!' అని బాబా చెప్పినట్లుగానే, వారి అనుంగుబిడ్డడైన పూజ్యశ్రీ మాస్టరుగారు కూడా వారి సమాధి నుండి సర్వ కార్యాలు నిర్వర్తిస్తున్నారు.

మా అమ్మాయి వివాహం కూడా మేము ఎక్కడా సంబంధాలు వెతకకుండానే వారంతట వారే తెలుసుకొని, గురువారంనాడు వచ్చారు! తర్వాత పూజ్యశ్రీ మాస్టరుగారి ఆశీస్సులతో మా అమ్మాయి వివాహం ఒక సాఫ్ట్-వేర్ ఇంజనీర్ తో 2006లో గురువారంనాడు జరిగింది. ఇలా మాకు ఇప్పటికీ అనేక నిదర్శనాలు జరుగుతూనే వున్నాయి.

పూజ్యశ్రీ మాస్టరుగారు నన్ను శ్రీ గురుచరిత్ర, శ్రీ సాయిలీలామృతం నిత్యపారాయణ చేయమన్నారు. ఆ రెండు గ్రంథాలు 108 సార్లు పారాయణ పూర్తి చేసి ఆయనను, "ఇంకా ఎన్నిసార్లు పారాయణ చేయమంటారు?" అని అడిగాను. వారు, "జీవితాంతం పారాయణ చెయ్! అన్నం మనం పుట్టిన దగ్గరనుంచి చనిపోయే వరకు ప్రతిరోజూ తింటున్నాం కదా?! విసుగు లేదు కదా! అలాగే జీవితాంతం పారాయణ చేయాలి!" అన్నారు. పూజ్యశ్రీ మాస్టరుగారి ఆజ్ఞ ప్రకారం ఇప్పటికీ పారాయణ చేస్తున్నాను. నన్ను బాబాను యిక ఏ కోరిక కోరవద్దని చెప్పారు. ఆరు మాసాలకు ఒకసారి తప్పకుండా శిరిడీ దర్శించుకోమన్నారు. ఆయన దయ వల్ల నేటికీ నియమం తప్పకుండా శిరిడీకి వెళ్తున్నాను. ఇప్పటికి 79 సార్లు శిరిడీ దర్శించాను. నాకు ఏది అవసరమైనా నేను కోరకుండానే అన్నీ సమకూరుతున్నాయి.

పూజ్యశ్రీ మాస్టరుగారు మా ఇంటికి మూడుసార్లు సత్సంగానికి వచ్చారు. వారు మా ఇంట్లో ద్వారకామయి బాబాను స్థాపించారు. అప్పటినుంచి మా ఇంట్లో నిత్యం నాలుగు హారతులు, పారాయణ చేసుకుంటున్నాము. ప్రతి గురుపూర్ణిమకి, విజయదశమికి, దత్త జయంతికి, అన్ని దత్తావతారాల చరిత్రలు పారాయణ చేస్తాము. ప్రతి సోమవారం మా ఇంట్లో సత్సంగం జరుగుతుంది.

పూజ్యశ్రీ మాస్టరుగారు నా జీవితాంతం నాకు తోడుగా వుండాలని వేడుకుంటూ వారి పాదపద్మాలకు ప్రణమిల్లుతున్నాను.

జై సాయి మాస్టర్!

# పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

**SRI GURUPADUKA PUBLICATIONS, C/o. SRI MANGA BHARADWAJA TRUST**
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole,Hyderabad - 500068, Phone: +91 7416041550
Branch Office : Kondalah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh. Phone: 8597233271
*Send DD in favour of 'Sri Manga Bharadwaja Trust (Publications)' Payable at Hyderabad or Ongole*

**శ్రీ గురుని పై విరచితమైన గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ గురు చరిత్ర - శ్రీ సాయి లీలామృతము (బౌండ్) | ₹499.00 |
| శ్రీ గురు చరిత్ర | ₹199.00 |
| శ్రీ సంహితాయన గురు ద్విసాహస్రి | ₹149.00 |
| శ్రీ దత్తావతార మహాత్మ్యము | ₹75.00 |

**శ్రీ శిరిడీ సాయిబాబాపై విరచితమైన గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతము | ₹199.00 |
| శ్రీ సాయి సన్నిధి | ₹199.00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము. | ₹119.00 |
| శ్రీ సాయినాథ పూజ | ₹49.00 |
| శిరిడీ హారతులు | ₹15.00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | ₹49.00 |
| శ్రీ సాయినాథ స్తవన మంజరి | ₹10.00 |
| సాయిని పూజించడం ఎందుకు? | ₹10.00 |
| సత్సంగము - భజన | ₹10.00 |
| సాయి సూక్తి - ఆచార్యవాణి | ₹20.00 |
| శ్రీ సాయి నిత్య సత్య వ్రతము | ₹20.00 |
| (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | |

**ఇతర మహాత్ముల గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ స్వామి సమర్థ | ₹75.00 |
| శ్రీ తాజుద్దీన్ బాబా | ₹75.00 |
| అవధూత శ్రీ వెంకయ్య స్వామి | ₹99.00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | ₹75.00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | ₹75.00 |
| శ్రీ ఆనందమయి అమ్మ | ₹75.00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | ₹99.00 |
| శ్రీ గురు సిద్ధారూఢ స్వామి | ₹99.00 |
| (రచన : శ్రీమతి శారదా వివేక్) | |
| అవధూత శ్రీ చివటం అమ్మ | ₹99.00 |
| (రచన : శ్రీమతి శారదా వివేక్) | |

**అన్వేషణాత్మకమైన వైజ్ఞానిక గ్రంథములు**

| | |
|---|---|
| ఏది నిజం? | ₹49.00 |
| మతం ఎందుకు? | ₹49.00 |
| విజ్ఞాన వీచికలు | ₹99.00 |
| పరిప్రశ్న | ₹119.00 |

**ధ్యాన సంబంధమైన గ్రంథములు**

| | |
|---|---|
| ధ్యానయోగ సర్వస్వము | ₹99.00 |
| బుద్ధ ధ్యాన హృదయము | ₹49.00 |

**ఆధ్యాత్మికత - తత్వచింతనా పూర్వక గ్రంథములు**

| | |
|---|---|
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | ₹199.00 |
| ఆధ్యాత్మిక జాగృతి | ₹199.00 |
| (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | |

**ఇతర గ్రంథములు**

| | |
|---|---|
| పురుషసూక్త రహస్యము | ₹49.00 |
| మనము - మన సంస్కృతి | ₹75.00 |

**పూజ్య భరద్వాజ గురుదేవులపై విరచితమైన గ్రంథములు**

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు | ₹149.00 |
| (రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | |
| భగవాన్ శ్రీ భరద్వాజ | ₹299.00 |
| (రచన : శ్రీమతి శ్రీదేవి) | |
| మహా పురుషుడు | ₹60.00 |
| (రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు -1 | ₹199.00 |
| (సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు -2 | ₹199.00 |
| (సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | |
| ఆచార్య అమృత లేఖావళి | ₹199.00 |
| (సంకలనం : శ్రీ సి.థామస్ రెడ్డి) | |
| మరో నంద దీపం | ₹120.00 |
| మాస్టారు అమృత వాక్కులు | ₹99.00 |
| (రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | |

**బాలల కొరకు విరచితమైన గ్రంథములు**

| | |
|---|---|
| బాలల సాయి లీలామృతము | ₹49.00 |
| (రచన : శ్రీమతి అడిదం వేదవతి) | |
| బాలల సాయిసన్నిధి | ₹75.00 |
| (రచన : శ్రీమతి అడిదం వేదవతి) | |
| బాలల శ్రీ గురు చరిత్ర | ₹75.00 |
| (రచన : శ్రీమతి అడిదం వేదవతి) | |

**BOOKS IN ENGLISH**

| | |
|---|---|
| Sai Baba The Master | ₹249.00 |
| Shri Guru Charitra | ₹149.00 |
| Supreme Master | ₹149.00 |
| Tajuddin Baba | ₹149.00 |
| Sai Baba and His Teachings | ₹149.00 |
| Children's Sai Baba The Master | ₹80.00 |
| *(Author: Smt. Adidam Vedavati)* | |

**BOOKS IN OTHER LANGUAGES**

| | |
|---|---|
| Sadguru Sri Sai Baba (Hindi) | ₹249.00 |
| Sri Guru Charitra (Hindi) | ₹249.00 |
| Sri Sai Leelamruthamu (Kannada) | ₹249.00 |
| Sri Sainatha Prabodhamruthamu (Kannada) | ₹149.00 |
| Sri Guru Charitra (Kannada) | ₹199.00 |
| Sri Sai Sannidhi (Kannada) | ₹249.00 |
| Tibet Yogi Milarepa Charitra (Kannada) | ₹119.00 |
| Sri Swami Samartha (Kannada) | ₹119.00 |
| Sri Sai Leelamruthamu (Tamil) | ₹249.00 |
| Sri Guru Charitra (Tamil) | ₹299.00 |
| Sri Shirdi Sai Aartulu (Tamil) | ₹29.00 |
| Sri Sainatha Stavana Manjari (Tamil) | ₹20.00 |
| Sri Sai Leelamruthamu (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Odiya) | ₹299.00 |
| Sri Sai Sannidhi (Odiya) | ₹249.00 |



మే 11, 2025 ఆదివారము ఉదయము 10:00 గంటలకు 'శ్రీ సాయి లీలామృతము గ్రంథ కృతజ్ఞతార్చన మహోత్సవము' సందర్భంగా శ్రీ అలివేలు మంగమ్మ దివ్యసన్నిధానము, గుమ్మళంపాడు లో గురుపుత్రులు శ్రీ ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ దంపతులు గ్రంథ పూజ చేశారు. అనేకమంది భక్తులు కూడ ఈ కార్యక్రమంలో శ్రద్ధాభక్తులతో పాల్గొన్నారు.

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Printed and published by Dr. R.S. Sasidhar on behalf of E. Vikramaditya and printed at Vanaja Printers, Vijayawada and published at Sri Manga Bharadwaja Trust, Ongole (523002) - Editor: Dr. R.S. Sasidhar.
Postal Registration Number : Prakasam/16/2024-2026, Regd.No. 37926/83.








సకల సాధు స్వరూపులు, సకల దేవతా స్వరూపులు పరిపూర్ణ దత్తావతారులైన సమర్థ సద్గురువు శ్రీ శిరిడీ సాయిబాబావారి పాదుకలు మే నెల 4వ తేదీ ఆదివారం నాడు గుమ్మళంపాడు శ్రీ అలివేలుమంగమ్మ దివ్యసన్నిధానమునకు మరియు ఒంగోలులో శ్రీ సాయి భరద్వాజ నిలయమునకు వేంచేసినాయి. గురు పుత్రులు శ్రీ ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ దంపతులు శ్రీవారి పాదుకలకు పూజ గావించారు. భక్తులందరూ సంతోషంతో దర్శనాదికాలు చేసుకున్నారు.